
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 12.06.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 02 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# చిక్కుల్లో చంద్రుడు



- ఆంధ్రా హజారేకు కష్టాలు
- చుక్కలు చూపిస్తున్న కేసీఆర్
- ఎరక్కపోయి ఇరుక్కుపోయాడు
- ప్రకంపనలు సృష్టిస్తున్న ఒక ఓటు - ఐదుకోట్లు
- రాష్ట్రాల వివాదంగా మార్చాలని చూస్తున్న బాబు

గడచిన వారం రోజుల్లో చంద్రబాబు ఒక్కసారైనా అనుకుని ఉంటాడు... 1999లో ఈ కేసీఆర్‌కు ఒక్క మంత్రి పదవి పడేసి వుంటే ఈరోజు నాకు ఈ తలనొప్పి ఉండేది కాదుకదా అని! ఆరోజు చంద్రబాబు ఆ పని చేసుంటే ఒక్క ఆయన తలనొప్పే కాదు, తెలంగాణ ఉద్యమం ఉండేది కాదు, రాష్ట్ర విభజన జరిగేది కాదు, మనకింత అవస్థ ఉండేదే కాదు. గతం గతః... జరిగిపోయిన దాని గురించి ఇప్పుడు ఏడ్చి లాభం లేదు.

(మిగతా 11వ పేజీలో)



## పేదమనసుల నేత... పెంచలయ్య కన్నుమూత

2లో

# వై 'కాపు'

- జగన్‌లో మార్పు
- పార్టీలో కొత్త కూర్పు



2014 ఎన్నికల్లో గెలుపు తనదేనని వైకాపా అధినేత జగన్ నూటికి నూరు శాతం నమ్మకంతో ఉండినాడు. ఒక్క జగనే కాదు చివరకు తెలుగుదేశం నాయకులు కూడా చాలామంది వైకాపాదే ప్రభుత్వమనుకున్నారు. తీరా ఫలితాలు చూసాక సీన్ రివర్సయ్యింది. అటు జగన్, ఇటు చంద్రబాబు... ఇద్దరూ ఊహించని ఫలితాలు వచ్చాయి. సీఎం సీటు ఖాయమనుకున్న జగన్ ప్రతిపక్షనేత సీట్లోనూ, ఈసారి ప్రతిపక్షనేత పాత్ర తప్పదేమోననుకున్న చంద్రబాబు సీఎం కుర్చీలోనూ కూర్చోవడం జరిగిపోయాయి.

(మిగతా 11వ పేజీలో)



# కోలాహలంగా వెంగమాంబ బ్రహ్మోత్సవాలు

మెట్ట ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత నర్రవాడలోని వెంగమాంబ పేరంటాళ్ళ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తుల కొంగు బంగారంగా, పతిభక్తికి ప్రతిరూపంగా, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా దుత్తలూరు మండలం, నర్రవాడ వెంగమాంబ విరాజిల్లుతోంది. ఈ ఉత్సవాలు ఈ నెల 7వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, నర్రవాడ సర్పంచ్ మేకపాటి మాల్యాద్రినాయుడుల పర్యవేక్షణలో భక్తులకు అన్ని వసతులతో నిర్వహించారు. ముందుగా వీరు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించగా, తల్లీ వెంగమాంబ... చల్లగా చూడు తల్లీ... మమ్ములను కరుణించమ్మా అంటూ వచ్చిన భక్తులతో నర్రవాడ వెంగమాంబ సన్నిధి కోలాహలంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఉత్సవాలకు మొదటిరోజు నుండే అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు, వేదమండితులు అమ్మవారి గర్భ గుడిని ప్రత్యేక పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజాము నుండే ఆలయ ఉపప్రధాన అర్చకులు బి.పెదభద్రయ్య సహస్రనామ, కుంకు



మార్చన, ప్రత్యేక హోమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు:** ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఉదయగిరి శాసనసభ్యులు బొల్లినేని వెంకటరామారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే రాకతో ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అదేవిధంగా ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, కావలి డిఎస్పీ రాఘవరావు, ఉదయగిరి సిఐ శ్రీనివాసరావు, దుత్తలూరు ఎంపిపి రవీంద్రబాబు, జడ్పీటీసీ సభ్యులు సీదర్ల మల్లిఖార్జున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

5రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలలో 7వ తేదీ నిలుపు కార్యక్రమంతో మొదలుకాగా, అదేరోజు సంతానం లేని మహిళలు అమ్మవారి ముందు సాష్టాంగ నమస్కారాలతో వరపడ్డారు. 8వ తేదీ సోమవారం గ్రామోత్సవం సందర్భంగా వెంగమాంబ పుట్టినిల్లు వడ్డిపాలెం నుండి ప్రారంభమై దేవస్థానానికి చేరుకుంది. 9వ తేదీ కూడా అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. 10వతేదీ అత్యంత వైభవంగా అమ్మవారి కళ్యాణం నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ ఉత్సవంతో రాత్రికి ప్రధానోత్సవంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 11తేదీ భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను తిప్పి మొక్కును తీర్చుకున్నారు. సాయంత్రం బండ లాగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు తిలకించేందుకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా దేవస్థానం అధికారులు, కావలి డిఎస్పి రాఘవరావు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

సింహపురి సమాచారం

## దేవాదాయశాఖ పరిధిలోకి
# మల్లాం... శ్రీ మార్కండేశ్వరాలయం

చిట్టమూరు మండలంలోని మల్లాంలో ఎంతో పురాతన కాలం నుంచి వున్న కామాక్షీదేవి సమేత శ్రీ మార్కండేశ్వరాలయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ తన పరిధిలోకి తీసుకుని, ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వి. రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 6న ఆయన ఆలయ ఇ.ఓ రమణారెడ్డితో కలసి, ఈ ఆలయాన్ని పరిశీలించారు. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఈ ఆలయాన్ని తమ శాఖ పరిధిలోకి తీసుకుంటున్నామని, త్వరలో ఆ మేరకు నోటిఫికేషన్ జారీ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతమైనట్లు తమకు ఫిర్యాదులు అందాయని, స్వామివారి స్థిర, చరాస్తులకు సంబంధించి ఎలాంటి దుర్వినియోగాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆలయ భూముల వివరాలు వగైరాలను ఆయన ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ దువ్వూరు శేషారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వున్న అర్చకులే విధుల్లో కొనసాగుతారని, ఆలయ ట్రస్టీ దువ్వూరు శేషారెడ్డి ఆధ్వర్యంలో ఆలయానికి సంబంధించిన ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

# నష్టాల బాటలో ఆర్టీసీ

నెల్లూరు ఆర్టీసీ రూ.102కోట్ల నష్టాల బాటలో పయనిస్తోందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ మహేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకు ఆర్ఎం వచ్చి డిపోలోని బస్సుల వివరాలను, ప్రయాణీకుల రాకపోకలు, నష్టాలు తదితర అంశాలపై ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని 10డిపోల పరిధిలో 2014-15 సంవత్సరానికి గాను రూ.44కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. రీజియన్‌లోని కార్మికులు అధికారులందరూ కష్టపడి పనిచేసి లాభాల బాటలోకి వచ్చేలా ప్రయత్నాలు చేస్తామన్నారు. జిల్లాలో ఏ డిపో కూడా లాభాల్లో లేదన్నారు. నష్టాలు వచ్చే మార్గాలలోని బస్సులను లాభాలు వచ్చే రహదారుల్లో నడిపేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సూళ్లూరుపేట బస్టాండులోకి అన్ని డిపోల బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖర్చులు తగ్గించి రాబడి కోసం కొన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందుకు ప్రయాణీకులు సహకరించాలని కోరారు.

## పేదమనసుల నేత...
# పెంచలయ్య కన్నుమూత

నెల్లూరుజిల్లాలో రాజకీయంగా తెరమీదకు వచ్చిన దళిత నాయకులలో గుర్తుంచుకోదగ్గ వ్యక్తి, మాజీమంత్రి పసల పెంచలయ్య. ఆయన ఈనెల 8వతేదీ సోమవారం రాత్రి 8గంటలకు కన్నుమూసారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమం కావడంతో చెన్నైకు తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. పెంచలయ్య వయస్సు 75సంవత్సరాలు. నాయుడుపేట మండలంలోని తుమ్మూరు ఆయన సొంతూరు. రాజకీయాల్లోకి రాకముందు జిల్లా పౌరసంబంధాల శాఖాధికారిగా మెదక్, ప్రకాశం జిల్లాలలో పనిచేశారు. స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ప్రోత్సాహంతో ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చారు. 1979లో తిరుపతి లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 1984లో అదే తిరుపతి నుండి ఓడిపోయారు. 1989అసెంబ్లీ ఎన్నికల్లో సూళ్లూరుపేట అసెంబ్లీ నుండి పోటీ చేసి గెలిచారు. 1992-94ల మధ్య నేదురుమల్లి క్యాబినెట్‌లో సమాచారశాఖ మంత్రిగా, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి క్యాబినెట్‌లో గృహనిర్మాణశాఖ మంత్రిగా పనిచేసారు. 1994, 1999 ఎన్నికల్లో ఇదే సూళ్లూరుపేట నియోజకవర్గం నుండి ఆయన ఓడిపోయారు. 2004, 2009లలో తిరిగి సీటు కోసం ప్రయత్నించినా నెలవల సుబ్రహ్మణ్యం ఎగరేసుకుపోయాడు. 2014ఎన్నికలకు ముందు ఆయన తన అల్లుడు కిలివేటి సంజీవయ్యతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరిపోయారు. గత ఎన్నికల్లో సూళ్లూరుపేట వైకాపా అభ్యర్థిగా నిలబడ్డ తన అల్లుడు సంజీవయ్యను గెలిపించుకోవడంలో ఆయనకున్న మంచిపేరు ఎంతగానో ఉపయోగపడింది. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## క్యాన్సర్ ఆసుపత్రిలో
# లీనియర్ ఆక్సిలరేటర్ భవనానికి భూమిపూజ



నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో లీనియర్ ఆక్సిలరేటర్ భవనానికి ఈ నెల 11వ తేదీన భూమిపూజ నిర్వహించారు. సుమారు 60లక్షల వ్యయంతో నిర్మించబోయే ఈ భవనానికి దొడ్ల వరదారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ వారు 50లక్షల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది. ఈ భూమిపూజ కార్యక్రమంలో దొడ్ల వరదారెడ్డి, దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, పొన్నపోలు సీతారామిరెడ్డి, వారి కుటుంబసభ్యులు మరియు క్యాన్సర్ ఆసుపత్రి వ్యవస్థాపక సభ్యులు డా॥ ఏ.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయ్యాక ఆక్సిలిరేటర్ యంత్ర సామాగ్రిని ఏర్పాటుచేసి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మరింత మెరుగైన రేడియేషన్ చికిత్సను అందించనున్నారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో ఇంకా హాస్పిటల్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి డా॥ టి.లక్ష్మి, సర్జికల్ ఆంకాలజిస్ట్ డా॥ ఎం.నాగేశ్వరరావు, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా॥ గీతాపుష్పశ్రీ, సర్జన్ డా॥ జె.వి.రామ్మోహన్, సోనాలజిస్ట్ డా॥ వి.సమత, హాస్పిటల్ సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.


**విజయ లేబొరేటరి ★థైరోకేర్ (ACC) - నెల్లూరు ★ఒబీసిటీ క్లినిక్ - 2000**

**ధన్వంతరి ఆరోగ్య ధామం ★పతంజలి యోగాలయం ★ గాంధీజీ ప్రకృతి ఆశ్రమం**



మా 'విజయ లేబొరేటరి' 30వ వార్షికోత్సవం (జూన్ 16, 1985 -2015) సందర్భంగా రోగనిర్ధారణ పరీక్షలు, అధిక బరువు & లావు తగ్గింపుకై 20% డిస్కౌంటు ఇవ్వబడును. స్థూలకాయులకు ఉచితంగా కౌన్సిలింగ్ చేయబడును. ఈ సదవకాశం కొద్ది రోజులు మాత్రమే!

లభ్యమగు సేవలు (Services Offered) : లేబొరేటరి మెడిసిన్ : క్లినికల్ పాథాలజి, బయోకెమికల్, థైరాయిడ్ & హార్మోనల్ పరీక్షలు, బయాప్సీ, సైటాలజి, FNAC, Pap Smear, సిరాలజి, కల్చర్, జెనిటిక్, HIV& AIDS పరీక్షలు, లైఫ్ఇన్సూరెన్స్ పరీక్షలు, మాస్టర్ హెల్త్ చెకప్, వెల్ వుమన్ చెకప్ మొ॥ పరీక్షలు చేయబడును.

వసతులు : ఫిజియోథెరపి, జిమ్నాసియం, ఆరోగ్యయోగాలయం. ఈస్థటిక్ మెడిసిన్ : అధిక బరువు & లావు తగ్గింపు, షుగరు, బి.పి, కొలెస్ట్రాల్, గుండెజబ్బులు, స్థూలకాయం, కీళ్ల నొప్పులు, సయాటికా, సంతానలేమి, జీర్ణ సంబంధ వ్యాధులు, ఋతు సమస్యలు మొదలైన వాటికి ఆయుర్వేద, యోగ, నేచర్ క్యూర్ ద్వారా పరిష్కార మార్గాలు. డైట్, ఎక్సర్‌సైజ్ & యోగా థెరపి ద్వారా వ్యాధుల నయం, ధ్యానం, ప్రాణాయామం, యోగాలో శిక్షణ.ఆరోగ్య & వ్యాయామ విద్యల గురించి శిక్షణ తరగతులు నిర్వహించబడును.

Pearl Anniversary మా అభివృద్ధికి కారకులైన అందరికి మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు. Pearl Anniversary

డా॥ యం. పెంచలరెడ్డి, యండి, డిసిపి., రోగనిర్ధారణశాస్త్రవేత్త, స్థూలకాయం వైద్య నిపుణులు ఆరోగ్య యోగ నిపుణులు, హెల్త్ & ఫిట్‌నెస్ ట్రైనర్.

శ్రీమతి యం. అరుణ, మేనేజింగ్ డైరెక్టర్ యోగా థెరపిస్ట్, లేడీ ఫిట్‌నెస్ ట్రైనర్

డా॥ యం. హరికృష్ణారెడ్డి - శ్రీమతి లక్ష్మీమల్లిక యం.బి.బి.యస్., (డి.యన్.బి..) ప్లాస్టిక్ & కాస్మొటిక్ సర్జన్ బేబి లక్ష్మీనిహారిక

డా॥ యం. విజయలక్ష్మి, యం.డి., రోగనిర్ధారణ శాస్త్రవేత్త, యోగా థెరపిస్ట్ ఫిట్‌నెస్ & వెయిట్‌లాస్ ట్రైనర్ మాస్టర్ విష్ణుచరణ్‌రెడ్డి

డా॥ యం. రాజశేఖర్‌రెడ్డి యం.బి.బి.యస్., డి.యన్.బి., పురిటి, చిన్నపిల్లల వైద్య నిపుణులు

వివరములకు సంప్రదించవలసిన చిరునామా : 16-5-60, ఇందిరాభవన్‌రోడ్డు, సురభిరామయ్యవీధి, నెల్లూరు - 524 001. ఆం.ప్ర. ఫోన్ : 0861-2324405, సెల్ : 9866534908, ఇ-మెయిల్ : obesityclinic2000@yahoo.co.in Website: www.obesityclinic2000.com

# వెంకటగిరి చేనేతకు అరుదైన గౌరవం

## - బంగ్లాదేశ్ ప్రధానికి బహుమతిగా అందజేసిన నరేంద్ర మోడీ



వెంకటగిరి చేనేతకు మరో అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 6వ తేదీ బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాకు ప్రధాని నరేంద్ర మోడీ వెంకటగిరి చేనేత కార్మికుడు గౌరాబత్తిన రమణయ్య అత్యద్భుతంగా రూపొందించిన, ప్రత్యేక డిజైన్‌లతో ఎంతో ఆకర్షణీయంగా తయారుచేసిన పరదాను బహుకరించడం విశేషం. గతంలో కూడా రమణయ్య చేనేతలో ప్రత్యేక ప్రతిభను సాధించి ఎంతో అరుదైన రాష్ట్రపతి అవార్డును కూడా అందుకుని సింహపురి సీమకే కాక, చేనేతరంగానికే ఎనలేని కీర్తిని తెచ్చారు. విశేష ప్రతిభతో, అరుదైన శైలితో.. రెండు వైపులా ఒకేవిధంగా కనిపించే జాందనీ వర్క్‌తో రూపొందించిన పరదాను బంగ్లాదేశ్ ప్రధానికి మన దేశ ప్రధాని నరేంద్రమోడీ ద్వారా బహుమతిగా అందించి రమణయ్య తన ప్రతిభా విఖ్యాతిని మరింత ఇనుమడింపజేసుకున్నారు. తద్వారా వెంకటగిరి చేనేత చీరల ప్రఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేశారు. చేనేతలో ఇంతటి విశేష ఖ్యాతిని గడించిన గౌరాబత్తిన రమణయ్యకు 'లాయర్' అభినందనలు.



చెంగవల్లి వెంకట్‌ను సత్కరిస్తున్న స్వయంపాకుల శ్రీనివాసులు


# బ్రాహ్మణుల కోసం బాబు కృషి

దేశ చరిత్రలో ప్రప్రథమంగా బ్రాహ్మణుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ సంక్షేమ నిధి మేనేజింగ్ డైరెక్టర్ చెంగవల్లి వెంకట్ అన్నారు. ఆయన నెల్లూరు వచ్చిన సందర్భంగా నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య పాలకవర్గ సభ్యులు ఆయన్ను కలిసి బ్రాహ్మణ ఐక్యతకు చేసిన కృషిని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమనిధి నుండి జిల్లా పరిధిలో పేద బ్రాహ్మణులందరికీ గృహవసతి, విద్యా ప్రోత్సాహక ఆర్థికసహాయం, వైద్యసదుపాయాలు, వృత్తివిద్యా సహకారం, వృద్ధాప్యపెన్షన్లు, అన్యాక్రాంతమైన బ్రాహ్మణ సంఘ ఆస్తులు, దేవాలయ ఆస్తులు, సత్రములపై న్యాయపరమైన చర్యలు, అర్చకులు, పురోహితులకు అవసరమైన సహాయకచర్యలు కలిగించమని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ సంక్షేమ నిధి ఫలితాలు అందరికీ నేరుగా దక్కేందుకు, యువత పురోగతికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొని అందరికి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు డా॥ పివిఎస్ఆర్‌కె మూర్తి, గౌరవసలహాదారు స్వయంపాకుల శ్రీనివాసులు, అధ్యక్షులు గుడ్డదొన వాసుదేవరావు, కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, కోశాధికారి సివిఎల్ నరశింహం తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చయతాంబూలం

## వరుణ్ - సాయిశ్రీ



ప్రముఖ న్యాయవాది, కోవూరు వాస్తవ్యుడు బత్తిన రామకృష్ణారెడ్డి - విజయశ్రీల కుమారుడు **బత్తిన వరుణ్** వివాహ నిశ్చితార్థం నెల్లూరు వాస్తవ్యులు బల్లెల శ్రీధర్‌రెడ్డి - సుజితల కుమార్తె **సాయిశ్రీ**తో జూన్ 6వ తేదీ నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది.

సేవాతత్పరుడిగా, ప్రజానేతగా కావలి నియోజకవర్గంలో పేరుగాంచిన కావలి మాజీశాసనసభ్యుడు కీ॥శే॥ బత్తిన రామకృష్ణారెడ్డికి వరుణ్ మునిమనుమడు కాగా, కోవూరు పరిసర ప్రాంతాల్లో ప్రఖ్యాత న్యాయవాదిగా జిల్లా అంతా ప్రసిద్ధి చెందిన స్వర్గీయ బత్తిన వెంకటరమణారెడ్డికి స్వయానా మనుమడు.

అత్యంత వైభవంగా జరిగిన ఈ నిశ్చితార్థ వేడుకలో అబ్బాయి మినహా, అమ్మాయి, అబ్బాయి బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా మంచి ఫలితాలు

## - ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టౌన్‌హాల్ ట్రస్ట్ పురస్కారాలు



కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు కూడా ఈ ఏడాది టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించడం తమకెంతో ఆనందంగా వుందని డిఇఓ ఆంజనేయులు అన్నారు. ఆదివారం రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, ఈ ఏడాది టెన్త్‌లో ప్రతిభ కనపరచి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఇఓ మాట్లాడుతూ, కష్టపడి చదువుకుంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకో వచ్చన్నారు. ఉత్తమమైన వ్యక్తిత్వంతో ఎన్నో విజయాలు సాధించవచ్చని, విద్యార్థులు ప్రతిభతో రాణించేందుకు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు వారిని ప్రోత్సహిస్తూ వుండాలని ఆయన సూచించారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులను, సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పుర మందిరం ట్రస్ట్ కార్యదర్శి జెవిఎస్ రెడ్డి మాట్లాడుతూ, ఉత్తమ వ్యక్తిత్వంతోనే ఉత్తమ పౌరులుగా రాణిస్తారని, విద్యార్థులకు మంచి చదువుతో పాటు, ఉన్నతమైన వ్యక్తిత్వం అలవడేలా ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలని అన్నారు. ఎవరు ఏ స్థాయిలో వున్నప్పటికీ మానవత్వాన్ని విస్మరించకూడదని, మానవీయ విలువలను మరచిపోకూడదని అన్నారు. అనంతరం నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో, మండల పరిధిలో, ఉన్నత పాఠశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన 45 మంది విద్యార్థులకు, ఒక్కొక్కరికి 5 వేల రూపాయల వంతున నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. అంతేకాక, ప్రతిభతో రాణిస్తున్న ఆ విద్యార్థులందరికీ ప్రతిభా పురస్కార సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, విశ్రాంత తెలుగు అధ్యాపకులు కరిమద్దెల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోర్టు సహకారంతో

# జర్నలిస్ట్ కాలనీకి నీళ్ళయోగం



నెల్లూరులోని కొత్తూరు సమీపంలో వున్న జర్నలిస్టుకాలనీలో ఈ నెల 10వ తేదీన మంచినీళ్ల ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ది నెల్లూరు జర్నలిస్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పాలకవర్గ సభ్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కాలనీకి ఈశాన్యంలో వాస్తువరంగా శంకుస్థాపన చేయించారు. 23లక్షల అంచనాతో నిర్మిస్తున్న ఈ ట్యాంకును కట్టేందుకు కృష్ణపట్నం పోర్టు కంపెనీ ముందుకొచ్చింది. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు జి.జయరాజ్, ఉపాధ్యక్షుడు కె.గోపీనాథ్, డైరెక్టర్లు కె.హరిబాబు, ఎస్.డి.జమీర్, షఫి అహ్మద్, ఎస్.కోటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, బి.రాజన్, డి.సురేష్, ఎల్.శ్రీధర్, ఎ.మల్లిఖార్జునలు పాల్గొన్నారు.


10వ తరగతిలో అద్భుతఫలితాలు "మైథిలి" సొంతం
2015 మార్చి SSCలో 10/10 పాయింట్లతో స్టేట్ రికార్డ్
Recognised by the Govt. of A.P.
MYTHILEE
మైథిలి
ENGLISH MEDIUM SCHOOL
Digital Smart Classes
Chandramouli Nagar, Opp: Nippo,
Nellore. Tel.: 0861 - 2304848
100% ఉత్తీర్ణత
43 మందికి 43 మంది పాస్



10/10
P.S. Bhanu Teja



B. Sivani 9.8



R.S.R. Tanmayi 9.8



B.V.Deekshitha 9.8

9-10 మధ్య - 20మంది
8-10 మధ్య - 33మంది
మైథిలి మనోహర్‌రెడ్డి
కరస్పాండెంట్

# 'ప్రభా'తం

## 'బంగ్లా'తో మైత్రి



ప్రధాని మోడీ బంగ్లాదేశ్ పర్యటన విజయవంతమైంది. ఇరుగుపొరుగు దేశాలతో ఆయన చేస్తున్న స్నేహయాత్రలో భాగంగా చేసిన ఈ పర్యటనతో బంగ్లాతో మన దేశానికి వున్న స్నేహబంధం మరింత బలోపేతమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య 22 ఒప్పందాలు జరగడంతో భారత్ - బంగ్లా స్నేహవారధి మరింత పటిష్టమయ్యేందుకు వీలు కల్పించినట్లయింది. ద్వైపాక్షిక సంబంధాలను పటిష్ఠం చేసుకోవడమే కాక, ఎన్నాళ్ళుగానో జటిలంగా వున్న సరిహద్దు సమస్యల పరిష్కారానికి కూడా ఈ పర్యటన దోహదం చేయడం చరిత్రాత్మకమే!..

భారత ప్రధాని నరేంద్రమోడీ బంగ్లాదేశ్ పర్యటనతో భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య మైత్రీభావం వెల్లివిరిసింది. ఈ పర్యటనతో భారత్-బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాల్లో మరో ముందడుగు పడినట్లేనని భావించవచ్చు. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగానే ఎటూ తేలకుండా అపరిష్కృతంగానే వున్న 1974 నాటి భూ సరిహద్దు ఒప్పందంపై రెండు దేశాలూ ఒక నిర్ణయానికి వచ్చి ఆ మేరకు ఒప్పందాలపై సంతకాలు చేయడం ఒక చరిత్రాత్మక పరిణామమే అవుతుంది.

భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య 4096 కిలోమీటర్ల భూ సరిహద్దు వుంది. అప్పట్లో బంగ్లాదేశ్ ఆవిర్భావ సమయంలో భారత్‌కు చెందిన కొన్ని భూభాగాలు బంగ్లాదేశ్‌లోనూ, బంగ్లాదేశ్‌కి చెందిన కొన్ని భూభాగాలు భారత్‌లోనూ వుండిపోయాయి. వీటిని పరస్పరం మార్పిడి చేసుకునేందుకు 1974లో రెండు దేశాల మధ్య భూ సరిహద్దు ఒప్పందం కుదిరినప్పటికీ, దాని అమలులో ఆనాటి నుంచి ప్రతిష్టంభన నెలకొనేవుంది. ఇప్పుడు ఇన్నాళ్ళు..ఇన్నేళ్ళ తర్వాత మోడీ పర్యటనతో ఆ ప్రతిష్టంభన తొలగిపోవడం ఎంతైనా సంతోషదాయకం. తాజా ఒప్పందం ప్రకారం, రెండు దేశాల మధ్య 161 భూభాగాలను మార్పిడి చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఈ ఒప్పందం ద్వారా భారత్ భూభాగంలో వున్న 111 ప్రాంతాలను బంగ్లాదేశ్‌కు, ఆ దేశంలో వున్న 51 భారత్ భూ భాగాలను భారత్‌కు బదిలీ చేయడం జరుగుతుంది. దాదాపు 40 ఏళ్ళుగా ప్రశ్నార్థకంగానే వున్న దాదాపు 50 వేల మంది పౌరసత్వానికి సంబంధించిన సమస్య ఎట్టకేలకు ఈ తాజా ఒప్పందంతో పరిష్కారం కానుండడం నిజంగా ఒక చరిత్రాత్మక ఘట్టమే. ఈ తాజా ఒప్పందం మేరకు, సరిహద్దులో వున్న 510 ఎకరాలు భారతదేశ నియంత్రణలోనూ, 10 వేల ఎకరాలు బంగ్లాదేశ్ నియంత్రణలోనూ వుంటాయి. సరిహద్దు సమస్యల పరిష్కారం విషయంలో మోడీ చొరవకు బంగ్లాదేశ్ ప్రధాని హసీనా సైతం ప్రశంసల వర్షం కురిపించారంటే, ఈ అంశంలో అటు భారత ప్రభుత్వం, ఇటు ప్రధాని మోడీ ఎంత ప్రభావవంతంగా ఆలోచించి నిర్ణయాలు చేసివుంటారో వూహించవచ్చు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో ప్రధాని మోడీ, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో పాటు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ కూడా పాల్గొనడం విశేషం.

ఈ సందర్భంగా, బంగ్లాదేశ్‌కు 200 కోట్ల అమెరికన్ డాలర్ల రుణసాయం చేసేందుకు భారత్ అంగీకరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కోల్‌కతా నుంచి ఢాకా మీదుగా అగర్తలా వెళ్ళే బస్సు సర్వీస్‌ను, ఢాకా-షిల్లాంగ్-గౌహతిల మధ్య మరో బస్ సర్వీస్‌కు ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానులు ప్రారంభించారు. ఖుల్నా-కోల్‌కత మధ్య రెండవ మైత్రీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టాలన్న బంగ్లాదేశ్ ప్రతిపాదనకు మోడీ అంగీకారం తెలిపారు. జల రవాణాలోనూ ఇరుదేశాలు సహకరించుకునేందుకు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పౌర అణు విద్యుత్, పెట్రోలియం, ఇంధనం సహా పలురంగాల్లో ఇరుదేశాలు పరస్పర సహకారం అందించుకోవాలని నిర్ణయించుకోవడం శుభ పరిణామం. ఆ మేరకు 'నవతరం-కొత్త దిశ' అనే పేరుతో ఇరు దేశాల ప్రధానులు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు కూడా. ద్వైపాక్షిక వాణిజ్య అభివృద్ధికి, ఆర్థిక రంగంలో పరస్పర సహకారానికి వీలు కలిగించేలా ఇరుదేశాలూ ఒప్పందాలు చేసుకోవడం భారత్-బంగ్లా బంధం మరింత బలోపేతం చేసేవే. భారతీయ కంపెనీలు తమ దేశంలో రెండు ప్రత్యేక ఆర్థికమండళ్ళు ఏర్పాటు చేసుకునేందుకు బంగ్లాదేశ్ అనుమతి ఇవ్వడం సంతోషదాయకం. ప్రధాని మోడీ పర్యటనలో ఇరు దేశాల మధ్య 22 ఒప్పందాలు జరగడంతో భారత్-బంగ్లా స్నేహవారధి మరింత పటిష్టమయ్యేందుకు వీలు కల్పించినట్లయింది. ఇలా అన్ని విధాలా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించి, ఎన్నాళ్ళుగానో వున్న సమస్యలకు తెరవేయడం ద్వారా ఇరుదేశాల ప్రధానులు తమ పరిణితిని చాటుకున్నారు. అనంతరం, ఢాకాలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, పాకిస్తాన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఆ దేశం సమస్యలు సృష్టిస్తోందని, భారత్-బంగ్లాదేశ్‌లు కలసికట్టుగా ఈ ప్రాంతంలోని ఉగ్రవాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి ఎలాంటి విలువలు, సిద్ధాంతాలు లేవని, ఉగ్రవాదానికి ఎంతో మంది అమాయకులు బలై పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్పష్టమైన మోడీ ప్రసంగం అక్కడి నేతలను, ప్రజలనూ బాగా ఆకట్టుకుంది. అనంతరం, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రకటించిన 'బంగ్లా విమోచన పోరాట స్మారక గౌరవపురస్కారాన్ని' (విముక్తి యుద్ధ పురస్కారం) బంగ్లాదేశ్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ నుంచి వాజ్‌పేయి తరపున ప్రధాని మోడీ స్వీకరించి దేశ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేశారు. మోడీ పర్యటనకు బంగ్లాదేశ్‌లోని పత్రికలు కూడా ఎంతో ప్రాధాన్యతనిచ్చాయి. అన్ని ప్రధాన పత్రికల్లో తొలి పేజీలో మోడీ పర్యటన వివరాలు ప్రచురించాయి. ఈ పర్యటన ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక నూతన శకం ఆవిర్భవించినట్లుగా భావించవచ్చని ఆ పత్రికలు పేర్కొన్నాయి.

ఆసియా దేశాలలో బంగ్లాదేశ్, భారత్‌కు ఎంతో కీలకమైనది. బంగ్లాదేశ్ కూడా ముస్లిం దేశం అయినప్పటికీ పాకిస్థాన్‌కు దీనికి పోలికలు లేవు. భారత్‌తో ఎప్పుడూ సన్నిహితంగానే మెలుగుతున్న దేశమిది. కాబట్టి బంగ్లాదేశ్‌తో బంధాన్ని మరింత దృఢతరం చేసుకోవడం ఎంతైనా అవసరం కూడా! ఆ పనే ఇప్పుడు మోడీ చేసాడు.

ఏదేమైనా, బంగ్లాదేశ్ పర్యటన విజయవంతం కావడం ద్వారా.. ప్రధాని మోడీ పొరుగుదేశాలతో కొనసాగిస్తున్న స్నేహయాత్రలో ఇది మరో మైలురాయి అనే చెప్పవచ్చు.

## వేడుకగా శ్రీనివాస కల్యాణం



నెల్లూరు రాంనగర్ వద్ద వున్న టిటిడి కల్యాణ మండపంలో టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీదేవీ భూదేవి సమేత శ్రీ శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం ఎంతో వేడుకగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణల మధ్య స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పువ్వాడ వెంకటరమణయ్య, సుజాత, కాకర్ల వెంకటశివప్రసాద్, వసంత, వొమ్మిన నాగసతీష్‌బాబు, భానుమతి, సివి సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తిరుమల నుంచి తీసుకువచ్చిన పసుపు, అక్షింతలు, కంకణాలు వగైరాలను భక్తులకు అందజేశారు.

హిందూ ధర్మప్రచార మండలి ఉపాధ్యక్షుడు కొండా శేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి వంజివాక ధనుంజయ, పురాణపండితులు దేవరాజులు, హిందూ ధర్మప్రచారమండలి సభ్యులు వీరిశెట్టి సుధాకర్, కొండెపి గిరిజమ్మ, వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, వాకాటి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు తీర్చండి

### - విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుని డిమాండ్

విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా, ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్నవారి సమస్యలను పరిష్కరించాలంటూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం నెల్లూరులోని రామచంద్రారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు ప్రతి నెలా 7వ తేదీలోగా జీతాలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నా, గత అయిదు నెలలుగా వారికి జీతాలు ఇవ్వడం లేదని, దీంతో వారు ఎన్నో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 16వ తేదీ నుంచి విద్యుత్‌భవన్ వద్ద దశలవారీగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామయ్య, కృష్ణ, నాయకులు రమణారెడ్డి, జమీర్, మాల్యాద్రి, సమద్ తదితరులు పాల్గొన్నారు.

## కెవిఎన్‌కు ప్రగతిరత్న అవార్డు



నెల్లూరుజిల్లా వాసి, రచయిత, ప్రముఖ కవి, సాహితీవేత్త, రెవెన్యూ ఉద్యోగి కె.వి.నాగేశ్వర రావుకు చిత్తూరుజిల్లా తెలుగుభాషా పరిరక్షణ సమితి వారు తెలుగు వాఙ్మయ ప్రగతిరత్న పురస్కారాన్ని ప్రకటించారు. ఈ నెల 13వ తేదీ తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో జరుగనున్న పురస్కారాల ప్రదానోత్సవ సభలో ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును నాగేశ్వరరావుకు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, చిత్తూరుజిల్లా పార్లమెంట్ సభ్యులు ఎన్.శివప్రసాద్, తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షులు చదలవాడ కృష్ణమూర్తి, ఎస్వీయూ రిజిస్ట్రార్ దేవరాజులునాయుడు పాల్గొననున్నారు. ఇప్పటికే ప్రముఖ సాహితీ సంస్థల నుండి 30జాతీయ సాహితీ పురస్కారాలను నాగేశ్వరరావు అందుకొనివున్నారు.

## 15 నుండి పాఠశాలలు

ఈ నెల 15వ తేదీన జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని డిఇఓ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 80శాతం పుస్తకాల పంపిణీ పూర్తయ్యిందని, మిగిలిన వాటిని కూడా త్వరలోనే అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.




## ఆపరేటర్ పోస్టులు అమ్ముకున్నారు

నెల్లూరుజిల్లాలో షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులను ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు అమ్ముకున్నారు. అన్ని అర్హతలు ఉన్నవారికి కాకుండా తెలుగుదేశంపార్టీ వాళ్లకు ఈ పోస్టులు ఇచ్చారు. కొన్ని వందలమంది ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే అర్హులకు కాకుండా సిఫార్సులకే పెద్దపీట వేశారు. ఈ అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి.

**కోటగిరి చందన ప్రియ, నెల్లూరు.**

## కోటంరెడ్డికి కృతజ్ఞతలు

'లాయర్' పత్రికలో వచ్చిన 'ప్రజావాణి' వార్తకు స్పందించి నెల్లూరు గ్రామీణఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌ను కలిసి పెరికబలిజ కులస్తులకు కులసర్టిఫికేట్లు ఇవ్వాలని కోరడం అభినందనీయం. ఈ పని జరిగితే ఎంతో మంది పెరిక బలిజ విద్యార్థుల జీవితాలు బాగుపడతాయి. మంత్రి పి.నారాయణ కూడా ఈ సమస్యపై స్పందించాలి. ఈ సమస్యను వెలుగులోకి తెచ్చినందుకు 'లాయర్' పత్రికకు ధన్యవాదాలు

**యస్.సాత్విక్, నెల్లూరు.**

## శిథిలావస్థలో సరస్వతీ నిలయం

విడవలూరు మండల కేంద్రంలో గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. గత జడ్పీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి 5లక్షల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పరిచారు. అప్పటి ఎంపి పనబాక లక్ష్మి కూడా ఎంపీ గ్రాంట్ ఇచ్చారు. ప్రస్తుత జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఈ గ్రంథాలయం గురించి పట్టించుకోవాలి.

**పావిశెట్టి సంతోష్‌కుమార్, నెల్లూరు.**

## గవర్నర్ కోటాలో ఎలా ఇస్తారు?

తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలను గవర్నర్ కోటాలో శాసనమండలికి ఎంపిక చేయడం చట్ట విరుద్ధం. రాజకీయాల కతీతంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైనవారికి ఇవ్వాల్సిన గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ఇలా పక్కా రాజకీయ నాయకులతో భర్తీ చేయడం అన్యాయం.

**డి. పెంచలయ్య, నెల్లూరు.**



# నెల్లూరుసీమకు పట్టిసీమ నీళ్లిస్తాం

## - సంగంలో చెప్పిన చంద్రబాబు

'జన్మభూమి - మా ఊరు' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 5వ తేదీన జిల్లాలోని సంగంకు వచ్చారు. ముఖ్యమంత్రి అయిన ఈ ఏడాది కాలంలో చంద్రబాబు జిల్లాకు రావడం ఇది ఐదోసారి. విభజన తర్వాత రాష్ట్రంలో 13జిల్లాలే మిగలడం, హైదరాబాద్‌లో ఆయన చేసే పనేమీ లేకపోవడంతో మిగిలిన ఈ జిల్లాలను చుట్టిరావడం ఆయనకు చాలా సులభంగా వుంది. అదీగాక హైదరాబాద్ నుండి నేరుగా హెలికాప్టర్ వాడడం లేదు. రేణిగుంట, విజయవాడ, విశాఖలలో ఎయిర్‌పోర్టులుండడంతో అక్కడి దాకా విమానంలో రావడం, అక్కడ నుండి హెలికాప్టర్ ఎక్కడం ఆయనకు మంచినీళ్ల ప్రాయమైంది.

సంగంలో జరిగిన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టిసీమ ప్రాజెక్ట్ నీళ్లను నెల్లూరుజిల్లాకు ఇస్తామని చెప్పారు. గోదావరి నీళ్లను పట్టిసీమ ద్వారా శ్రీశైలంకు తెచ్చి అక్కడ నుండి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నెల్లూరు జిల్లాకు నీటిని తరలిస్తామని చెప్పుకొచ్చారు. జిల్లాలోని సంగం, నెల్లూరు బ్యారేజీలను తొందరగా పూర్తిచేసి వచ్చే ఏడాదికల్లా నీరందిస్తామన్నారు. వీటిని పూర్తి చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌ల క్రింద చివరి ఆయకట్టు భూములకు కూడా నీరందించాలని కోరారు. తెలుగుగంగ, సోమశిల కాలువలను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసేందుకు అటవీశాఖ నుండి అడ్డంకులు తొలగినట్లు కూడా చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబు సంగం బ్యారేజీని పరిశీలించారు. బ్యారేజీ వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు శిద్ధా రాఘవరావు, పి.నారాయణ, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతంరెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, వితపు బాలసుబ్రహ్మణ్యం, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆత్మకూరు తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ గూటూరు కన్నబాబు, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కలెక్టర్ ఎం.జానకి, జేసీ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన అనుకున్న దాని కంటే గంటకుపైగా ఆలస్యమైంది. దీంతో ఎర్రటి ఎండలో సభకు వచ్చిన వృద్ధులు, మహిళలు అల్లాడిపోయారు. సభ ముగిశాక హమ్మయ్యా అంటూ వెనుదిరిగారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# మాగుంటకు ఇది అవసరమా?



***సోమశిల రిజర్వాయర్‌లో ఆ పక్క నుండి ఈ పక్కకు ఈది, సోమశిల ఉత్తరకాలువను దాటడానికి తంటాలు పడుతున్నట్లుగా వుంది మాజీఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి పరిస్థితి. కాంగ్రెస్ వంటి అతి పెద్ద ప్రజాస్వామ్య పార్టీని వదిలి తెలుగుదేశం వంటి నియంతృత్వ పార్టీల్లోకి వెళితే ఎలాంటి నాయకులు ఎలా అయిపోతారనడానికి శీనయ్యే ఒక ఉదాహరణ.***

మూడుసార్లు ఎంపీగా గెలిచిన మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఇప్పుడు ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ పదవి కోసం పోటీ చేస్తుండడాన్ని మాగుంట అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. అది కూడా గవర్నర్ కోటాలోనో, ఎమ్మెల్యేల కోటాలోనో ఇచ్చుంటే ఓ రకంగా వుండేది. స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి నిలబెట్టారు. దీనికి ఎలక్షన్ జరగాలి. వైకాపా అభ్యర్థి నుండి పోటీని ఎదుర్కోవాలి. ప్రకాశం జిల్లాలో అధికార తెలుగుదేశం కంటే వైకాపాకే ఎక్కువ ఓట్లున్నాయి. అయినా అధికారపార్టీ కాబట్టి వైకాపా ఓట్లు కూడా తెలుగుదేశంకే కొన్ని పడొచ్చు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాగుంట శీనయ్య గెలిచే అవకాశమే వుంది. అయితే దీని కోసం మాగుంట కుటుంబం స్థాయిని దిగజార్చుకోవాలా అని అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

1992లో స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి ఒంగోలు లోక్‌సభకు పోటీచేసి విజయం సాధించారు. అక్కడి నుండే ప్రకాశం జిల్లాకు మాగుంట కుటుంబానికి మధ్య విడదీయరాని అనుబంధం ఏర్పడింది. 1995లో నక్సలైట్ల ఘాతుకానికి సుబ్బరామన్న బలయ్యారు. 1996లో జరిగిన ఎన్నికల్లో ఒంగోలు నుండి సుబ్బరామన్న సతీమణి పార్వతమ్మ పోటీ చేసి విజయం సాధించింది. 1998లో మాగుంట శ్రీనివాసులురెడ్డి రాజకీయాల్లోకి వచ్చాడు. ఆ ఎన్నికల్లో గెలిచిన శీనయ్య 1999లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయాడు. 2004లోనూ, 2009లోనూ జరిగిన ఎన్నికల్లో ఆయన ఒంగోలు ఎంపీగా గెలిచాడు. రాష్ట్ర విభజన అనంతర పరిస్థితుల్లో 2014లో ఆయన కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశంలో చేరారు. ఒంగోలు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి కొద్ది మెజార్టీ తేడాతో ఓడిపోయాడు. ఆయన స్థాయికి రాజ్యసభకు వెళ్లుంటే సరిపోయేది కదా... అనవసరంగా ఎమ్మెల్సీ స్థాయికి దిగిపోయాడే అని మాగుంట అనుయాయులు బాధపడుతున్నారు.



జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి!!

# ఉత్తరక్రియలు

అనురాగంలో అన్నగా... అభిమానానికి తమ్ముడిగా...
ప్రేమను పంచడంలో తల్లిలా... ఆదరించడంలో తండ్రిలా...
అంతా నువ్వై నడిపించావు. మా మనసుల నిండా
నీ జ్ఞాపకాలనే నింపావు!

**మా దైవం, మా ఇంటి దీపమైన**

## శ్రీ మాచవరం వెంకటేశ్వర్లు గారు

(ప్రొప్రైటర్, హోటల్ శ్రావణ్య, శ్రావణ్య క్యాటరింగ్)

**తే.06.06.2015ది శనివారం స్వర్గస్తులైనారు.**

భౌతికంగా మా నుంచి దూరమైనా... మీ ఆత్మ
ఎల్లప్పుడూ మా వెన్నంటి వుండాలని భగవంతుని ప్రార్థిస్తూ...

**కుటుంబ సభ్యులు**
**సిబ్బంది - ఆత్మీయులు**

**పెద్దకర్మ:** 18.06.15 గురువారం నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో స్కూల్ పక్కన గల మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# నెల్లూరు కబుర్లు

## పోలీసులకు తిప్పలు

చీటికి మాటికి ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తుండడంతో బందోబస్తు చూడలేక పోలీసులు చస్తున్నారు. సీఎం వచ్చేది పెద్ద పనులకా అంటే అదీ కాదు. నీరు–చెట్టు, తట్ట–పుట్ట కార్యక్రమాలకు వస్తున్నాడు. ఆయన వస్తున్నాడంటే జిల్లాలో అన్ని పోలీసుస్టేషన్‌లలో ఉన్న సిబ్బందిని పిలవాల్సి వస్తుంది. సీఎం వచ్చిన రోజు అన్ని పోలీసుస్టేషన్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎక్కడ ఏ చిన్న నేరం జరిగినా చెప్పుకోవడానికి పోలీసులు లేకుండా పోతున్నారు. మొన్న 5వ తేదీ జిల్లాలో ఇదే పరిస్థితి. పోలీసు యంత్రాంగమంతా సీఎం బందోబస్తుకు వెళ్లిపోయింది. ఆ పక్కరోజే అమరావతి రాజధానికి శంకుస్థాపన పెట్టడంతో సగం మంది పోలీసులు అక్కడకు పోయారు. ఇలా పోలీసులకు ప్రజల కోసం కంటే విఐపి బందోబస్తు సేవలోనే వారి పుణ్యకాలం గడిచిపోతోంది.

## ప్రజాసమస్యలు పరిష్కరించండి



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొత్త కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పివివిఎస్ మూర్తిని నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ వైయస్సార్సీపీ ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రూప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి సొంత జిల్లాలోని కార్పొరేషన్ కార్యాలయంలో అనేక విభాగాలకు ముఖ్యమైన అధికారులు లేరన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కమిషనర్‌ను కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ విప్ బొబ్బల శ్రీనివాసులుయాదవ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఇ.డి గా రవీంద్రబాబు

నెల్లూరు జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇ.డి)గా ఎస్. రవీంద్రబాబు నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రవీంద్రబాబు పదోన్నతిపై ఇ.డిగా ఇక్కడకు వచ్చారు. నెల్లూరు జోన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు వున్నాయి. మొన్నటిదాకా ఇక్కడ ఇ.డిగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు విజయవాడ ఇ.డిగా బదిలీ అయ్యారు. కొత్తగా నియమితులైన ఆర్టీసీ ఇ.డి రవీంద్ర బాబుకు 'లాయర్' శుభాకాంక్షలు.

## రైల్వేస్టేషన్‌లో డిఆర్ఎం

దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ అశోక్‌కుమార్ ఈ నెల 9న నెల్లూరులోని ప్రధాన రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛరైల్వే కార్యక్రమంలో భాగంగా ప్రయాణీకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫ్లాట్‌ఫారాలు, ఆర్పీఎఫ్ కార్యాలయంలను పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఎస్కలేటర్‌లను చూసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రైల్వేస్టేషన్‌లో త్వరలో వైఫై సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. గోదావరి పుష్కరాల కోసం వివిధ ప్రాంతాల నుండి అదనంగా 350ట్రిప్పుల రైళ్లను నడుపుతున్నట్లు చెప్పారు. అలాగే బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో హైలెవల్ ఫ్లాట్ ఫాంను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డివిజన్ రైల్వే కమర్షియల్ ఆఫీసర్ సత్యనారాయణ, రైల్వేస్టేషన్ మేనేజర్ షాజహాన్, కృష్ణపట్నం ఏరియా ఆఫీసర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.


శ్రద్ధాంజలి



మాలో ఒకడిగా వుంటూ, మాతో ఎంతో ఆత్మీయంగా మెలిగి,
హఠాత్తుగా మాకు దూరమై భగవంతుని సన్నిధి చేరిన
మా ఆప్తుడు
శ్రీ మాచవరం వెంకటేశ్వర్లు గారి
(ప్రొప్రైటర్, హోటల్ శ్రావణ్య, శ్రావణ్య క్యాటరింగ్)
మృతికి చింతిస్తూ...
వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

గ్రోసు గోపాలయ్య, వ్యవస్థాపకులు
మురళీకృష్ణ 70 గ్రూప్ ఆఫ్ హోటల్స్
నెల్లూరు

నిర్వాణ
మాగుంట లే అవుట్, నెల్లూరు.




## బి.వి.కి ఆరాధన పురస్కారం

సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలలో రెండువేలకు పైగా జరిగిన సభలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి ద్విసహస్ర సభాసింహంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న నెల్లూరీయుడు బి.వి.నరసింహం నెల్లూరుజిల్లాలో ప్రప్రథమంగా రంగస్థల వ్యాఖ్యాతగా రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నెల 5వ తేదీ హైదరాబాద్ త్యాగరాజు గానసభలో జివిఆర్ ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ రంగస్థల వ్యాఖ్యాతగా బి.వి.నరసింహంను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి వ్యాఖ్యాత పురస్కారాన్ని దూరదర్శన్ కార్యనిర్వహణాధికారి ఓలేటి పార్వతీశం, సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.విజయబాబు, ప్రముఖ సాహితీవేత్త డా॥ ముక్తేవి భారతి అందజేశారు. రంగస్థల వ్యాఖ్యాతగా రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్న బి.వి.నరసింహంను సింహపురి కళాకారులు, కళాభిమానులు, సాహితీవేత్తలు, సంగీతాభిమానులు, నగర ప్రముఖులు అభినందించారు.

## సిపిఎంకు సంబంధం లేదు

డాక్టర్ విజయకుమార్ హత్య కేసులో హంతకులకు అండగా కొందరు కమ్యూనిస్టుల హస్తం వున్నట్లు ప్రచారం జరుగుతుందని ఇందులో సిపిఎం పార్టీకి ఏలాంటి సంబంధం లేదని పార్టీ జిల్లా నాయకులు జక్కా వెంకయ్య, జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్‌లు పేర్కొన్నారు. నెల్లూరు సిపిఎం కార్యాలయంలో ఆదివారం విలేఖర్లతో మాట్లాడుతూ విజయకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం అవసరం లేదని తమపార్టీ తీర్మానించలేదన్నారు. డాక్టర్ భార్య ఉషారాణి, కుటుంబసభ్యులతో తమ పార్టీలో ఎవరికీ ఎలాంటి సంబంధంలేదన్నారు. తమ పార్టీ వ్యతిరేకులు కుట్రతో బురద జల్లేందుకు పరోక్షంగా ఇలాంటి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

## జన్మభూమిలో డిష్యూం... డిష్యూం...

నెల్లూరుజిల్లా జాయింట్‌కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ సమక్షంలోనే ఇరువర్గాల వారు దాడులు చేసుకుని తిట్టుకున్న సంఘటన జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో జరిగింది. రాజకీయపార్టీల కతీతంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాల్సిన కార్యక్రమం వివాదాస్పదమైంది. 6వతేదీ నెల్లూరు కపాడిపాళెంలో జన్మభూమి కార్యక్రమం స్థానిక కార్పొరేటర్ ప్రశాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా నగరమేయర్ అబ్దుల్ అజీజ్, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ పాల్గొన్నారు. తొలుత ప్రసంగించిన నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తన ప్రసంగంలో తెలుగుదేశం ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు గుప్పించి విరుచుకుపడ్డాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మేయర్ అజీజ్‌లపై పరోక్షంగా ఆరోపణలు చేసారు. అనంతరం కార్పొరేటర్ ప్రశాంతికుమార్ మాట్లాడుతుండగా ఎమ్మెల్యే అనుచరులు అడ్డు తగిలి పోలీసుల సమక్షంలోనే కుర్చీలతో దాడులకు దిగారు. అక్కడేవున్న జేసీని పక్కకు నెట్టేసి, పోలీసులు అడ్డుపడుతున్నా ఆగకుండా దాడులకు దిగారు. దీంతో స్థానిక మహిళలు మా ప్రాంతానికి వచ్చి మా అబ్బాయిపైనే దాడికి దిగుతారా అంటూ ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే సహా అనుచరులు అక్కడి నుండి వెళ్లిపోయారు. జేసీ కూడా వెళ్లిపోయాడు. మేయరు సమక్షంలో జన్మభూమి కార్యక్రమం కొనసాగింది. ఇరువర్గాల వారు మూడవనగర పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు.

## తేడా వస్తే చర్యలు తప్పవ్

నెల్లూరు నగరపాలక సంస్థలో జరగాల్సిన అన్ని పనులు ప్రణాళికా బద్ధంగా జరగాలని, తేడా వస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ పివివిఎస్ మూర్తి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు నగరపాలక సంస్థ అన్ని శాఖల అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలో వివరించారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు నిర్ణీత గడువులోగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఇ ఇమాముద్దీన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తపాలా ద్వారా పుష్కర జలాలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రజలకు పవిత్ర గోదావరి పుష్కర జలాలను తపాలా సేవల ద్వారా అందజేయాలని నిర్ణయించినట్లు ఏ.పి. సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బి.వి.సుధాకర్ తెలిపారు. జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఈ సేవలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. పుష్కరాల ప్రారంభమైన అనంతరం సేకరించిన గోదావరి జలాలను శుద్ధిచేసి 500ఎంఎల్ పుష్కర జలాలుండే ఒక్కో సీసాకు రూ.20లు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాల్లో జూలై 14వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. పుష్కరజలాల కోసం నమోదు చేసుకున్నవారికి జూలై నెల 15వ తేదీ నుండి వారిచ్చిన అడ్రస్సుకు తపాలాశాఖ ద్వారా అందజేయడం జరుతుందన్నారు. నెల్లూరుజిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రతిభకు భుజం తట్టిన కోటంరెడ్డి



సేవలోనే ఎంతో సంతృప్తి వుందని, ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేశానని, అందులోనూ పేదరికంలో మగ్గుతూ వున్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ ప్రతిభతో రాణిస్తున్న విద్యార్థులను విద్యలో మరింతగా ప్రోత్సహించడం తనకెంతో సంతోషకరమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ అన్నారు. అలా అనడమే కాకుండా, ప్రతిభా విద్యార్థులకు తనవంతు ప్రోత్సాహం అందివ్వాలనే ధ్యేయంతో, శాసనసభ్యునిగా తనకు వచ్చే రూ.60 లక్షల జీతాన్ని కూడా సేవా కార్యక్రమాలకే వినియోగిస్తూ ఆయన తన జీవితాన్ని సార్థకం చేసుకుంటున్నారు. ఆదివారం నగరంలోని నెల్లూరు రూరల్ వైఎస్సార్సీపి కార్యాలయ ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 32 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.10వేల వంతున ఆర్థికసాయం అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి వారికి జ్ఞాపికలను బహుకరించారు. 40 మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించడం విశేషం. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న సిద్ధవరప్పాడుకు చెందిన బండి పూజిత అనే చిన్నారికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ మిత్ర మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు కూడా ప్రతిభతో రాణించడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఉత్తమ ప్రతిభ కనుపరచిన విద్యార్థులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అండదండలందిస్తూ వారిని ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాస యాదవ్, లక్ష్మీ సునంద, ప్రశాంత్‌కిరణ్, పరమేశ్వరరెడ్డి, సంపూర్ణతో పాటు స్థానిక నేతలు పాతపాటి పుల్లారెడ్డి, చింతంరెడ్డి జనార్దన్‌రెడ్డి, విద్యాసంస్థల ప్రతినిధులు చంద్రశేఖరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణ, చంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అవినీతిపై ధ్వజమెత్తిన జడ్పీ

నెల్లూరుజిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగింది. అదేరోజు గుంటూరులో తెలుగుదేశంపార్టీ వారి మహాసంకల్ప సభ జరగడంతో ఆ పార్టీ సభ్యులంతా అక్కడకు పోయారు. దీంతో జడ్పీలో విపక్ష సభ్యులు లేకుండానే సమావేశం జరిగింది. సభలో కోరం లేకపోవడంతో దాదాపు అరగంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. అయితే మహా సంకల్ప సభ తేదీ ప్రకటించే నాటికే జడ్పీ సమావేశం గురించి నోటీసులు జారీచేసి ఉండడంతో జడ్పీ ఛైర్మెన్ రాఘవేంద్రరెడ్డి ఈ సమావేశాన్ని వాయిదా వేయలేక విపక్ష సభ్యులు లేకుండానే నడిపించారు. వైకాపా ఎమ్మెల్యేలలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలలో అవినీతిపై సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'నీరు-చెట్టు' పథకం పెద్ద బోగస్ అని, కోట్లాదిరూపాయలను దుర్వినియోగం చేస్తున్నారంటూ సభ్యులు మండిపడ్డారు. అలాగే ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, మత్స్యశాఖ, డ్వామా, ఐసిడిఎస్, వైద్య, ఆరోగ్యశాఖలకు సంబంధించిన అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. సంగం, పెన్నా బ్యారేజీలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని వాటిని తొందరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి కోరారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నెల్లూరులో గోమతి స్కూల్ దగ్గర నిర్మించే బ్రిడ్జి, అపోలో ఆసుపత్రి వద్ద నిర్మించే బ్రిడ్జిలను తొందరగా పూర్తి చేయాలని కోరారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్వర్ణముఖి బ్యారేజీకి క్యాబ్‌మెంట్ క్రింద కాకుండా సోమశిల నుండి, సాగునీరు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం 'నీరు-చెట్టు' కార్యక్రమంలో అవకతవకలను ప్రశ్నించారు.

ఈ సమావేశంలో వైస్‌ఛైర్మెన్ శిరీషా, జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్, జడ్పీ సిఇఒ జితేంద్ర, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వైకాపా జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.



# పుష్కర శోభాయాత్రలో పాలుపంచుకోండి



గోదావరి పుష్కరశోభా యాత్రలో ఆసక్తి వున్న 40ఏళ్ల లోపు వారు సంబంధిత తహశీల్దార్ కార్యాలయం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి పేర్కొన్నారు.

ఆదివారం నెల్లూరు కలెక్టర్ బంగ్లాలో గోదావరి పుష్కర శోభాయాత్రపై జరిగిన పత్రికా విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కొత్త రాష్ట్రంలో తొలిసారిగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గోదావరి పుష్కరాలు జూలై 14వ తేదీ నుండి 25వ తేదీ వరకు పెద్దఎత్తున జరుగుతాయని, ఆ పుష్కరాలకు హాజరయ్యేందుకు జిల్లా నుండి దాదాపు 1000మందిని తీసుకెళ్లేందుకు ఒక్కొక్క బస్సులో 40మందిని తీసుకెళ్లి గోదావరి పుష్కరశోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో పాల్గొనేవారు జూన్ 20లోపు తమ పేర్లను సంబంధిత తహశీల్దార్ కార్యాలయం వద్ద నమోదు చేసుకోవాలన్నారు. శోభాయాత్ర నిర్వహణకు అవసరమైన బస్సులు, భోజనాలు, తదితర సౌకర్యాలు రవాణాశాఖ సమన్వయంతో దేవాదాయశాఖ అధికారులు ఏర్పాటు చేస్తారన్నారు. దేవాదాయ, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖాధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది పాలనలో ఒరిగిందేమీ లేదు

**- ఆనం వివేకా విమర్శ**



రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది జరిగినా, ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని పిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి విమర్శించారు. టిడిపి పాలనకు వ్యతిరేకంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వివేకా మాట్లాడుతూ, ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, రాజధాని నిర్మాణం పేరుతో మాయమాటలు చెప్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. టిడిపి సంకల్పయాత్ర అదొక ముదుపుల యాత్ర అంటూ ఆయన విమర్శించారు. కేంద్రంతో పోరాడైనా సరే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తామన్న చంద్రబాబు ఇప్పుడు ఆ విషయమే పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం టిడిపి మ్యానిఫెస్టోల ప్రతులను దగ్ధం చేశారు.

డిసిసి అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఏసీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ, నాయకులు మునాఫ్, బాలకోటేశ్వరరావు, విజయ తదితరులు పాల్గొన్నారు.


## బ్రహ్మయ్య కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్

BRAHMAIAH COLLEGE OF ENGINEERING, NORTH RAJUPALEM, NELLORE

Affiliated to JNT University, Anantapur and Approved by AICTE, New Delhi

ఎన్‌హెచ్-5, నార్తురాజుపాలెం, కొడవలూరు మండలం, నెల్లూరు జిల్లా

సెల్: 7207207072, 9642346686, 9963188292 ఫ్యాక్స్: 08622-215218

Courses Offered :

**B.TECH**
CIVIL - 60
MECH - 60
ECE - 180
EEE - 120
CSE - 60

**M.TECH**
M.TECH (POWER ELECTRONICS)
M.TECH (MACHINE DESIGN)
M.TECH (COMPUTER SCIENCE ENGINEERING)

**M.B.A**
MBA - 180

**Diploma Courses**
CIVIL - 60
MECH - 60

* జిల్లాలోనే ప్రప్రథమంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన గదులలో విద్యాబోధన
* అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యా బోధన
* చాప్టర్‌వైజ్‌గా జెఎన్‌టియూ తరహాలో పరీక్షల నిర్వహణ
* అత్యాధునిక వసతులతో విశాలమైన ల్యాబొరేటరీ సౌకర్యం
* 24 గంటల డిజిటల్ లైబ్రరీ సదుపాయం
* విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం
* రుచికరమైన భోజనం కలిగిన మెస్ సదుపాయం
* 24 గంటలు మినరల్ వాటర్ సౌకర్యం
* జిల్లా నలుమూలల నుండి బస్సు సౌకర్యం
* అనుభవజ్ఞులైన డాక్టర్లచే వైద్య చికిత్స
* అద్భుతమైన ఉపాధి అవకాశాలు
* వైఫై ఇంటర్నెట్ సౌకర్యం * సువిశాలమైన క్రీడా ప్రాంగణం



G.BRAHMAIAH
Chairman& President

* ఇంటర్‌లో 900 పైన మార్కులు వచ్చి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కలిగిన విద్యార్థులకు బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 4 సం॥లు హాస్టల్‌లో ఉచిత భోజన సదుపాయం కలదు.
* హాస్టల్‌లో చేరకుండా ఇంటి వద్ద నుండి వచ్చు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
* ఎంసెట్‌లో ర్యాంకు వచ్చిన విద్యార్థులకు (ఫీజు రీఎంబర్స్‌మెంట్ అర్హత ఉన్న విద్యార్థులు) ఏవిధమైన ఫీజులు లేవు. నేరుగా వచ్చి కాలేజీలో చేరవచ్చును.
* హాస్టల్‌లో ఉండు విద్యార్థులకు సంవత్సరానికి 25000/- రూపాయలు మాత్రమే
* మొదటి సం॥ విద్యార్థులకు, బస్సు తిరుగు రూట్లలో ఎక్కడనుండైనా సం॥ రూ.6000/-లు మాత్రమే.
* మేనేజ్‌మెంట్ విద్యార్థులు నేరుగా సంప్రదించి తగిన రాయితీలు పొందవచ్చును.



Dr.K.Subrahmanyam
M.Tech., P.hd
PRINCIPAL
Brahmiah College Of Engg.

PGECET CODE : BCEN 1

EAMCET/ECET/ICET/POLYCET CODE : BCEN



# గూడూరు డివిజన్ వార్తలు

## రథయాత్ర విజయవంతం చేయండి



రథయాత్ర ప్రచార పత్రికలను విడుదల చేస్తున్న ఇస్కాన్ నెల్లూరు అధ్యక్షుడు సుకదేవస్వామి, ప్రక్కన మయూరి శ్యాం యాదవ్

గూడూరులో జగన్నాథ రథయాత్ర 11న జరుగుతుందని ఇస్కాన్ నెల్లూరు అధ్యక్షుడు సుకదేవస్వామి తెలిపారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రచార పత్రికలు విడుదల చేసి మాట్లాడారు. ఈ రథయాత్రలో రాష్ట్ర మంత్రులు, ఇస్కాన్ సీనియర్ ప్రతినిధి వసుగోష్, పలు రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొంటారని, ఆధ్యాత్మిక ప్రదర్శనలు, పురవీధుల్లో రథయాత్ర జరుగుతుందన్నారు. పిల్లల్లో నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు ఈ నెల 28న అళఘునాథ స్వామి దేవాలయంలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, రంగులపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రథయాత్ర సమన్వయకర్త భానుప్రకాష్, వెంకట్రమణారెడ్డి, మయూరిశ్యాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తులసిపూజ చేస్తున్న మహిళలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

## ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గూడూరు రాజావీధిలో వెలసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ తేదీ రాత్రి శ్రీవారికి ఏకాంతసేవ నిర్వహించారు. ఉదయం లక్ష తులసి పూజ, పుష్పయాగోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. లక్షతులసి పూజలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఉభయదాతలుగా తలమంచి సిద్ధారెడ్డి, రాజేశ్వరమ్మ వ్యవహరించారు. దీంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా చేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమాలను ఆలయ ఛైర్మెన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు, ఈవో తాతా శ్రీనివాసరావు, కమిటి సభ్యులు పర్యవేక్షించారు.

## ఆర్డీఓకు వినతుల వెల్లువ



తమ సమస్యలు పరిష్కరించాలని గూడూరు డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజలు ఆర్డీవో రవీందర్‌ను కలసి వేడుకున్నారు. సోమవారం నాడు జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినంలో ఆర్డీవో రవీందర్‌కు అర్జీలు అందజేశారు. బాలాయపల్లి మండలం బొల్లవారిపాళేనికి చెందిన రామకృష్ణ తన పొలాన్ని ఆక్రమించుకొని సాగుచేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరారు. ఇంకా పలువురు రైతులు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని, భూసమస్యలు పరిష్కరించాలని నివేదించారు.

## ఆన్‌లైన్‌లోకి అర్జీలు



గూడూరు పట్టణంలో జరిగిన 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమంలో 33వార్డుల నుంచి 1056 వినతులు అందాయని గూడూరు పురపాలక సంఘ కమిషనర్ ప్రమీల తెలిపారు. పింఛన్లు కోరుతూ 187, రేషన్‌కార్డులకు 150, ఇళ్ల స్థలాలకు 629, కాలనీల మంజూరుకు 51, ఇతరులు 29వినతులు ఇచ్చారన్నారు. వచ్చిన వాటిని ఆన్‌లైన్లో పొందుపరుస్తున్నామని, ప్రతి అర్జీదారుకు మీ కోసం అనే సందేశం ఫోనుకు పంపుతున్నామని తెలిపారు. ఆయా శాఖల వారికి వినతులు విభజించి పంపడం జరుగుతుందన్నారు.

## 28వ వార్డును దత్తత తీసుకున్న ఎంపి

పట్టణంలోని 28వ వార్డును తిరుపతి ఎంపి వరప్రసాదరావు స్మార్ట్‌వార్డు క్రింద దత్తత తీసుకున్నారని ఆ వార్డు కౌన్సిలర్ ఇస్రాయిల్ తెలిపాడు. ఎంపికి, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు, వైకాపా నాయకులు యల్లసిరి గోపాల్‌రెడ్డికి, కౌన్సిలర్లకు ఇస్రాయిల్ కృతజ్ఞతలు తెలిపారు.

## కాలధర్మం

### వేగూరు వెంకటేశ్వర్లు



వేగూరు క్యాటరింగ్ అంటే నెల్లూరుజిల్లాలోనే కాదు హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాలలో కూడా ప్రసిద్ధి. క్యాటరింగ్ ద్వారా అంచెలంచెలుగా ఎదిగి, నెల్లూరులో శ్రావణ్య మల్టిక్యూసైన్ రెస్టారెంట్‌ను స్థాపించి, అనతికాలంలోనే బెంగుళూరులోనూ శ్రావణ్య హోటల్‌ను విస్తరింపజేసి ఆతిథ్యరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, అందరిచేత వేగూరు వెంకటేశ్వర్లుగా పిలవబడే మాచవరం వెంకటేశ్వర్లు జూన్ 5వ తేదీన కన్నుమూసారు. ఆయన వయసు 46సంవత్సరాలు. ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం చేశారు. వెంకటేశ్వర్లు కొంతకాలంగా వెన్నెముక నొప్పితో బాధపడుతున్నారు. దీని చికిత్సలో భాగంగా ఎంఆర్ఐ స్కానింగ్ కోసం ఈనెల 1వతేదీన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. ఎంఆర్ఐ స్కానింగ్ చేస్తున్న సమయంలోనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఆయన ప్రాణం నిలపలేకపోయారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### జక్కా చంద్రశేఖర్‌రెడ్డి



చెన్నైలో వుంటున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడు వాసి జక్కా చంద్రశేఖర్‌రెడ్డి ఈ నెల 4వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 77సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యాపారరీత్యా ఆయన చెన్నైలో స్థిరపడ్డారు. పేపర్ కారుగేటింగ్ ఇండస్ట్రీని స్థాపించారు. సౌత్ ఇండియా కారుగేటెడ్ బాక్స్ మాన్యుఫాక్చుర్స్ అసోసియేషన్‌కు 1991లోనే అధ్యక్షుడిగా పనిచేసారు. ఆయన కుమారులు వెంకటేష్, ప్రసన్నలు తండ్రి వ్యాపారాలను చూస్తున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మృతికి సంతాపం తెలుపుతూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### చెరుకూరు బుజ్జమ్మ

అందరికీ సీబ్రోస్ సుబ్బారెడ్డిగా అలవాటైన చెన్నైలోని రెయిన్‌ట్రీ హోటల్ అధినేత చెరుకూరు సుబ్బారెడ్డి మాతృ మూర్తి శ్రీమతి చెరుకూరు బుజ్జమ్మ ఈ నెల 5వ తేదీన స్వర్గస్థులైనారు. ఆమె వయసు 80సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొడవలూరు మండలం యల్లాయపాలెం స్వగ్రామం. సుబ్బారెడ్డి కన్‌స్ట్రక్షన్ రంగంతో పాటు హోటల్ రంగంలోనూ కీర్తి గడించాడు. చెన్నైలోని నెల్లూరు జిల్లా ప్రముఖులలో ఆయన ఒకరు. చెన్నైలో స్థిరపడిన నెల్లూరీయులందరికీ ఆయన సుపరిచితుడు. ఆమె పెద్దకొడుకు సురేష్‌రెడ్డి గూడూరులో మైకా వ్యాపారంలో ఉన్నాడు. చెరుకూరు బుజ్జమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## అందరికీ ఆరాధ్యుడు జుంలేపీర్ బాబా

### కుల మతాలకు అతీతంగా ప్రార్థనలు



చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి పట్టణం ఆధ్యాత్మిక నిలయం. ఇక్కడ హిందూ ముస్లిం క్రైస్తవులు సహజీవనం చేస్తున్నారు. పండుగలు, ఉత్సవాలు కలిసి మెలసి జరుపుకుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో నిర్వహించే మహాశివరాత్రి, ఆడికృత్తిక, దసరా మహోత్సవాలు, ధర్మరాజుల తిరునాళ్ళలో ఎందరో ముస్లింలు సహకరిస్తే పలుచోట్ల పీర్ల పండుగను హిందూవులే నిర్వహించటం వీరిలోని మతసామరస్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. శ్రీకాళహస్తిలో నిర్వహించే మరో మహోత్సవం శ్రీశ్రీశ్రీ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జుంలేషా పీర్ చిష్టియుల్ ఖాదరీ వలీ అల్లా వారి ఉరుసు. మూలమైన పంచభూతాల్లో మనిషి మనుగడకు అత్యంత అవసరమైన 'వాయువు' స్వయంభువుగా వెలసినట్టు, అందరి ఆరాధనలను అందుకుంటున్న బాబా "జుంలేపీర్‌షావలి' సుమారు 500 సంవత్సరాలకు పూర్వం ఇక్కడ జీవ సమాధి అయినట్టు వృద్ధ తరాలవారు చెబుతారు. అప్పటి నుంచి భక్తులు భక్తితో మోకరిల్లి, శోకతప్త హృదయంతో ఆరాధిస్తే బాధలకు ఉపశమనం కల్గించే సత్య సంధుడుగా జుంలేపీర్‌బాబా ప్రసిద్ధికెక్కారు. ఇరవైఏళ్ళ క్రితం వరకు శ్రీకాళహస్తిలోని జుం లేపీర్ షావలీ దర్గా ఉరుసు అంటే జిల్లాలోనే కాక

### శ్రీకాళహస్తి న్యూస్



పొరుగురాష్ట్రాల్లో కూడా ప్రసిద్ధి. ఇక్కడ అర్చక హక్కుల కోసం కొందరు పోరాటాలు సాగించుకుంటుంటే ఎందరో బాధితులు తమ బాధలను తొలగించు మహానుభావా అంటూ వేడుకుంటూ వరాలను పొందుతున్నారు. అర్చన హక్కుల కోసం మూడు కుటుంబాలు కోర్టు చుట్టూ తిరుగుతూ కాలయాపన చేస్తుంటే, హిందూ వుల సారధ్యంలో గంధోత్సవ కార్యక్రమాలు ప్రతి యేడాది తప్పక నిర్వహిస్తున్నారు. కడప పీఠాధిపతులు ఆలీ జనాబ్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరిఫుల్లా మొహ్మద్ మొహ్మదుల్ హుసేని చిష్టియుల్ ఖాదరి సజ్జాదే నషీన్, ఆస్థాన – ఎ – మూగ్దుం యిలాహి, కడప షరీఫ్ వారి అధ్యక్షతన జూన్ 11, 12, 13, 14వ తేదీలలో ఉరుసు గంధోత్సవము అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 11వ తేది జెండా ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. 12వ తేది శుక్రవారం సాయంత్రం లేట్ దర్గా సయ్యద్ సర్వరుద్దీన్ సాహెబ్ సజ్జాదే నషీన్ ఇంటి నుండి బళ్ళారి డ్రమ్స్ మేళాతాళాలతో, నౌరంగ్ బాజాలతో, ఫకీరు జరబ్బులతో గంధం బయలుదేరి నాలుగు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. 13వ తేది శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు, 14వ తేది ఆదివారం సాయంత్రం తహలిల్ ఫాతెహ శ్రీస్వామి వారి ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు.

# బాబు, కేసీఆర్‌ల మధ్య పంచాయితీ

శ్రీను గల్పిక

అది ఆంధ్రుల పెట్టుబడితో ప్రపంచ మేటి నగరాల్లో ఒకటిగా రూపుదిద్దుకున్న తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం. సచివాలయం నుండి తెలంగాణ సీఎం కేసీఆర్ అప్పుడే తెలంగాణ భవన్‌కు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ కేటిఆర్, నాయని నరసింహా రెడ్డి, ఈటెల రాజేందర్, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, తలసాని శ్రీనివాసయాదవ్, కవిత వంటి నాయకులున్నారు. ఈరోజు వార్తలేంటో చూద్దామని కేసీఆర్ టివి ఆన్ చేసి 'ఏబిసి' టివి ఛానెల్ పెట్టాడు. చంద్రబాబు మీటింగ్ వస్తుంది. తమ్ముళ్లు... హైదరాబాద్‌ను నేనే అభివృద్ధి చేసా, సైబరాబాద్‌ను నేనే కట్టించా... హైటెక్‌సిటీ నాదే, హుస్సేన్‌సాగార్ నేను చేసిందే, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఇంటర్నల్ రింగ్‌రోడ్డు... అన్నీ నేను చేసినవే! హైదరాబాద్ ఈరోజు ఇలా ఉండడానికి కారణం నేనే... నేను లేకుంటే ఈ హైదరాబాద్ మురికివాడలాగా ఉండేది అని చెబుతున్నాడు. అది చూస్తున్న కేసీఆర్‌కు అరికాల్లో మండసాగింది. ఇతనేందిరా భయ్... హైదరాబాద్‌నంతా నేనే చేసినానంటాడు... ఇతని వాలకం చూస్తే ఛార్మినార్, సాలార్‌జింగ్ మ్యూజియం, గోల్కొండ, నవాబుల సమాధులు అన్నీ నేనే కట్టినానని చెప్పేటట్లున్నాడు. ఎక్కడోదిక్కడ ఫుల్‌స్టాప్ పెట్టాలిరా భాయ్ అని అన్నాడు. అంతలో ఏసిబి చీఫ్ ఎ.కె.ఖాన్ అక్కడకు వచ్చాడు. సార్, ఎమ్మెల్సీ ఎన్నికలకుగాను తెలుగుదేశం వాళ్లు నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను కొనుక్కోవాలనుకుంటున్నట్లు ఇన్‌ఫర్‌మేషన్ వచ్చింది. మీరు కోఆపరేట్ చేస్తే మేం వాళ్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటాం అని చెప్పాడు. అందుకు కేసీఆర్... ఈ ఆంధ్రోళ్లు ఆస్తులనే కాదు, మనుషులను కూడా కొనిపడేస్తారు. ఈ ఆపరేషన్ జాగ్రత్తగా చేయండి అని చెప్పి... ఏ.కె.ఖాన్‌ను పంపించాడు. తర్వాత కేసీఆర్ ఉండి.. వెదకబోయిన తీగ కాలికి తగిలిందిరా భాయ్... ఆ చంద్రబాబును ఎలా బుక్ చేద్దామా అని చూస్తున్నా, చివరకు అతనే బుక్ అవుతున్నాడు అని చెప్పాడు. నాయని నిర్శింహారెడ్డి లేచి... అవును సార్, చంద్రబాబు చాలా మేధావి అని నాకు ఇంతకాలం ఒక నమ్మకముండేది, కాని ఇంత అమాయకుడనుకోలేదు అని అన్నాడు. అంతలో వాచ్‌మెన్ వచ్చి ఆరోజు పోస్ట్‌మెన్ తెచ్చిన తపాలాను కేసీఆర్ ముందు పెట్టాడు. అన్నీ పత్రికలు, పుస్తకాలే. వాటిలో ఒక కవర్ మాత్రం వుంది. దానిమీద ఫ్రమ్ అడ్రస్ నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ అని ఉండడంతో కేసీఆర్ దృష్టి దానిమీద పడింది. వెంటనే ఆయన ఆ కవర్‌ను చించి అందులోని లెటర్‌ను చదవసాగాడు.

గౌరవనీయమైన కేసీఆర్ గారికి,

ఆంధ్రప్రదేశ్ ప్రజలు కన్నీటితో వ్రాసుకున్న మనవి.

మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌ను వదిలి మా రాష్ట్రానికి రావడం లేదు. మీరు మీ రెండు కళ్లు తెలంగాణ అనుకుంటున్నారు. కాబట్టి మీరు పూర్తిస్థాయిలో పని చేయగలుగుతున్నారు. కాని మా సీఎం ఒక కన్ను తెలంగాణ, ఒక కన్ను ఆంధ్రా అంటుండడంతో అసలు ఏ పనీ జరగడం లేదు. మా సిఎం హైదరాబాద్‌ను వదలకపోవడంతో ఆంధ్రా ఉద్యోగులు, వ్యాపారులు, సినిమావాళ్లు రావడం లేదు. రాష్ట్రం విడిపోయిందనే ఫీలింగ్ మాకు తప్ప మా పాలకులకు ఉన్నట్లు లేదు. మీరు నయానో, భయానో మా చంద్రబాబును ఆంధ్రాకు పంపించగలరు. ఆయన ఇక్కడ ఉంటే మా రాష్ట్రాన్ని మేం అభివృద్ధి చేసుకోగలం.

ఇట్లు

ఆంధ్రా ప్రజలు.

అని వ్రాసి వుంది. అది చదివిన కేసీఆర్‌కు... చంద్రబాబు ఇక్కడ ఉంటే మనమెంత సఫర్ అవుతున్నామో, చంద్రబాబు అక్కడ లేక వాళ్లు కూడా అంతే సఫర్ అవుతున్నారు. కాబట్టి ఏదో ఒకటి చేయాలని కేసీఆర్ ఆలోచనలో పడ్డాడు.

★★★★★

నామినేటెడ్ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్‌ను కొనుగోలు చేయడానికి వెళ్లి టిడిపి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. అది ఏసిబి వీడియో టేపుల్లో కూడా రికార్డైంది. అలాగే స్టీఫెన్‌సన్‌తో ఫోన్‌లో మాట్లాడి చంద్రబాబు కూడా బుక్కయ్యాడు. దీంతో వీళ్లు సాక్ష్యాధారాలతో సహా చిక్కినట్లయ్యింది.

★★★★★

అది హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాలు. ఓ పక్క కేసీఆర్, అతని మంత్రులు కూర్చొనివున్నారు. ఇంకో పక్క చంద్రబాబు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తమ్మినేని సీతారాం, పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి నేతలున్నారు. వారి మధ్యలో ఓ ఢిల్లీ పెద్ద మనిషి ఉన్నాడు. అతని ముఖానికి మాస్క్ వుంది. తనను ఎవరూ గుర్తుపట్టకూడదనేది ఆయన ఉద్దేశ్యం. ఈ పంచాయితీని ఆ ఢిల్లీ పెద్దే ఏర్పాటు చేసాడు. అతను వుండి... చంద్రబాబు పెద్ద మనిషి, ఎంత లేదన్నా ఒకప్పుడు మీరంతా కూడా ఆయనకు సన్నిహితులే, ఒక పార్టీలో కలిసి మెలసి పనిచేసిన వాళ్లే. ఆయన మీద కేసులు పెట్టి పగతీర్చుకుంటే మీకే మోస్తుంది. కాబట్టి ఆయన మీద గౌరవంతో నా మాట మీద నమ్మకంతో కేసు పెట్టొద్దు అని కోరాడు. దానికి కేసీఆర్... అలాగే కేసులు పెట్టం... కాకపోతే మాదో కండీషన్. చంద్రబాబు హైదరాబాద్‌ను వదిలి పోవాలి. హైదరాబాద్‌ను నేనే కట్టాను, సైబరాబాద్‌ను నేనే నిర్మించాను... అంటూ ఇంకెక్కడా చెప్పుకోకూడదు. అదీగాక మా చంద్రబాబును మా రాష్ట్రానికి పంపమని ఆంధ్రావాళ్లు నాకు లెటర్లు వ్రాస్తున్నారు. ఆంధ్రావాళ్లకు ఇంతవరకు అన్యాయం చేసాను, చంద్రబాబును అక్కడకు పంపిస్తే నన్నా కొంతన్నా ఆంధ్రావాళ్లకు న్యాయం చేయగలిగాననే తృప్తి నాకు కలుగుతుంది. ఆ కండీషన్‌కు చంద్రబాబును ఒప్పించండి అని చెప్పాడు. ఆ మాటలతో ఢిల్లీ పెద్ద ఏమంటారు అంటూ చంద్రబాబు వైపు తిరిగాడు. అప్పటికే చంద్రబాబు ఫోన్‌లో 'ఫోన్ ఇన్ కాల్' మాట్లాడుతున్నాడు. 'హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది ఎవరు?' అనే దానిపై ఏబిపి టీవీవాళ్లు చర్చావేదిక పెట్టి చంద్రబాబు అభిప్రాయం కోసం ఫోన్ చేసారు. చంద్రబాబు సెల్‌ఫోన్‌లోనే... తమ్ముడూ, హైదరాబాద్ అభివృద్ధికి ప్రధాన కారణం నేనే! నా వల్లే సాఫ్ట్‌వేర్ ఇక్కడ డెవలప్ అయ్యింది. ఎన్ఆర్ఐలు కోటీశ్వరులయ్యారు. నా పేరు చెబితే ప్రపంచ దేశాలన్నీ దిగివస్తాయి. నేను లేకుంటే ఈ హైదరాబాద్ ఛండాలంగా ఉండేది. హైదరాబాద్‌తో నాది విడదీయరాని బంధం అని చెబుతున్నాడు. అదంతా విన్న కేసీఆర్ ఆ ఢిల్లీ పెద్దమనిషితో... సార్, దెయ్యాలు మనుషులను పట్టడం గురించి విన్నాం గాని, మనుషులు నగరాలను పట్టడం ఇప్పుడే చూస్తున్నాం, అతని హైదరాబాద్ పిచ్చిని ఎవరూ వదిలించేరు. ఈ పంచాయితీ ఇక్కడ తెగేది కాదులే అంటూ లేచాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బంధువులతో సంబంధాలు బలపడతాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో ఆటంకాలు తొలగిపోతాయి. తలపెట్టిన పనులను సమర్థవంతంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధి కరంగా ఉండి ఆదాయవృద్ధి ఉంటుంది. వ్యవహారాలలో తొందరపాటు ప్రదర్శించవద్దు. రావలసిన బాకీలు కొంతమేరకు లభిస్తాయి. అదనపు ఆదాయం లభిస్తుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

భూములు, స్థలాల క్రయవిక్రయాలలో ఆలోచనకు పదునుపెట్టండి. పెద్దమొత్తాలలో పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలలో పెట్టుబడులకు తొందరపడవద్దు. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. వాహనాలు, యంత్రాల వల్ల గాయాలు తగలవచ్చును. నిరుద్యోగులకు సరైన అవకావశాలు రాకపోవచ్చును.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబసభ్యులకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. అవసరాలకు ధనం సర్దుబాటు కాగలదు. నమ్మి విలువైన వస్తువులు డబ్బు వేరొకరికి ఇవ్వవద్దు. కొత్త పనులకు శ్రీకారం చుడతారు. రాజకీయ వర్గాలకు, వృత్తుల వారికి జనసంబంధాలు బలపడగలవు. కొత్త పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు. మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. షేర్లు నిరుత్సాహ పరుస్తాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ప్రభుత్వ అనుమతులు లభించడం, బ్యాంకు ఋణాలు దొరకడం జరుగుతుంది. అనుకున్న పనులను సమర్ధవంతంగా జరుపుతారు. ఆదాయ వ్యయాలు ఫరవాలేదనిపించగలవు. వాణిజ్య వర్గాలకు అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. శుభకార్యాల నిర్ణయంలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు రావడం, ఆస్తి, కోర్టు వ్యవహారాలు రాజీకి రావడం జరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబ వ్యవహారాలు చక్కబడతాయి. ఇతరుల సలహాలను గుడ్డిగా పాటించక ఆలోచనలు చేయండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. వ్యవహారాలు సొంత పనులకు ఆటంకాలు ఎదురై మరల తొలగిపోతాయి. వృత్తి ఉపాధి పథకాలలో స్థిరపడతారు. ఆదాయం స్వల్పంగా పెరిగినా అనుకోని ఖర్చులు పైన బడగలవు. బిడ్డల విద్యా ప్రగతి బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబంలో కొద్ది అవగాహనా లోపాలుంటాయి. ఉద్యోగులు తమ పైఅధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. వాహనాలు నడిపేవారు, యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తపడాలి. అనుకున్నది సాధించేవరకు శ్రమిస్తారు. వ్యవహారాలలో ఒప్పందాలలో హామీలివ్వవద్దు. వ్యవసాయ నష్టాలుంటాయి. పనులు నిదానంగా జరుగుతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 12.06.2015 నుండి
తేది. 18.06.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మేష వృషభమిధున రాశులలో చంద్రుడు, వృషభంలో రవికుజ బుధులు, 15తేది నుండి మిధునంలో రవికుజులు, కర్కాటకంలో గురుశుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

**పంచాంగము:**

17తేది బుధవారము నుండి అధిక ఆషాఢమాస ప్రారంభము.

**ముహూర్తములు**

తేది 11 గురువారము ఉదయము గంట 8.17 నుండి గంట 10.25వరకు కర్కాటక లగ్నమున వివాహ, ఉపనయన, వ్యాపార అన్నప్రాశన, కేశ ఖండనలు. ఇక ముహూర్తములు లేవు.

**జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | శుక్ర | ఏకాదశి | రా॥ గం.1.18వ॥ |
| తేది. 13 | శని | ద్వాదశి | రా॥ గం.11.15వ॥ |
| తేది. 14 | ఆది | త్రయోదశి | రా॥గం.9.32వ॥ |
| తేది. 15 | సోమ | చతుర్దశి | రా॥గం.8.11వ॥ |
| తేది. 16 | మంగళ | అమావాస్య | రా॥గం.7.12వ॥ |

**అధికాషాఢమాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | బుధ | పాడ్యమి | సా॥గం.6.44వ॥ |
| తేది. 18 | గురు | విదియ | సా॥గం.6.42వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారవర్గాలకు మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. బంధువర్గంలో అనారోగ్య వార్తలు వింటారు. కోపం పట్టుదల కారణంగా పనులు చెడిపోకుండా జాగ్రత్త పడండి. ఈ కారణంగా ఇతరులతో మనస్పర్ధలు రావచ్చును. వృత్తి పరంగా అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు ఓపికగా జరుపుకొనండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులు నిదానంగా జరుగగలవు. ముఖ్య విషయాలలో నిర్ణయాలు చేయలేక ఇతరుల సలహాలు కోరతారు. ప్రభుత్వ పరంగా మీకు జరగవలసిన పనులు ఆలస్యం కాగలవు. రావలసిన బాకీలు నిలబడిపోవడం, అవసరాలకు ఋణం చేయడం జరగవచ్చును. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. నిర్మాణాలు మందకొడిగా సాగుతాయి. షేర్లపై లాభాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఆస్తి వ్యవహారాలు రాజీకి వస్తాయి. అధికారుల సహకారం, తోడ్పాటు ఉద్యోగులకు బాగుంటుంది. ఆరోగ్య లోపం స్వల్పంగా ఇబ్బంది పెడుతుంది. ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. రావలసిన బాకీలు ఆలస్యం కావడం వల్ల ఋణాలు చేయవలసి వస్తుంది. సొంత పనుల కొరకు ఎంత కష్టపడినా ప్రయోజనం ఉండదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి, ఆదాయం పెరుగుతుంది. ఇంట బయట మీ మాటకు విలువ ఉంటుంది. గృహావసరాలకు సమకూర్చుకొంటారు. ఖర్చులు పెరిగిననూ ఇబ్బందులుండవు. కొత్త వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. విద్యా ప్రగతి ఫలితాలు బాగుంటాయి. స్థలాల క్రయవిక్రయాలు జరుగుతాయి. వివాహ విషయాలపై శ్రద్ధచూపుతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సోదర బంధువర్గంతో స్వల్పంగా విభేదాలు రావచ్చును. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్తగా కాపాడుకొనండి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ప్రధాన భూమిక పోషిస్తారు. నిర్దిష్టమైన ఆలోచనలు, ప్రణాళికలతో వ్యవహారాలలో ఇంట బయట ముందుకు సాగుతారు. కొత్త వస్తువులు కొనడం, ప్రముఖులతో పరిచయాలేర్పడటం జరుగుతుంది. నిరుద్యోగులకు అవకాశాలు కలసివస్తాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

మీ సూచనలు సలహాల వల్ల ఇతరులకు మేలు కలుగుతుంది. దూరప్రయాణాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతున్నా, ఎక్కువగా టెన్షన్ పడుతుంటారు. కోపం, చికాకు తగ్గించుకొని ఇతరులతో వ్యవహరించండి. లేకుంటే తగాదాలు వచ్చే పరిస్థితున్నది. కొత్తగా ఉద్యోగప్రయత్నాలు చేస్తే అనుకూలత ఉంది.

# ఏఎంసి అక్రమాలపై గరం గరం...

## అధికారులను నిలదీసిన నూతన పాలకవర్గం






## కావలి కబుర్లు

గత నాలుగు సంవత్సరాలుగా కావలి వ్యవసాయ మార్కెటింగ్ కమిటి కార్యాలయంలో రాబడి, ఖర్చులలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఇటీవల ఈ మార్కెట్ యార్డ్‌కు నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. గత నెల 23వ తేదీన మార్కెటింగ్ కమిటి అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గత 4సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి పనులపై ఆరా తీయగా గతంలో పాలకవర్గం లేని సమయంలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు, ఆ సమయంలోనే అక్రమాలు చోటుచేసుకున్నట్లు వెల్లడైంది. దీనిపై మార్కెటింగ్ కమిటి డైరెక్టర్లు నిలదీయగా అధికారులు నీళ్లు నమిలారు. గతంలో జరిగిన అభివృద్ధి పనులలో నిధులు దుర్వినియోగం చేసినట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా రైతుబజారు రిపేర్ల పేరుతో పలుమార్లు నిధులు మంజూరు చేశారు. వాటిపై సరైన లెక్కలు చూపకపోవడంతో ఛైర్మెన్, డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా మద్దూరుపాడు మార్కెట్ యార్డులో సిమెంటురోడ్ల నిర్మాణంలో కూడా లక్షలాది రూపాయల నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. అక్కడే ఓపెన్ ఫ్లాట్‌ఫామ్, సోలార్ లైట్లు ఏర్పాటుపై కూడా పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నట్లు చర్చ సాగుతోంది. ఈ అనుమానాలకు కారణం ఒకే పనిని పలుమార్లు రికార్డుల్లో చూపించడమే. సమావేశంలో నూతన పాలకవర్గం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ యార్డ్ అధికారుల వద్ద సరైన సమాధానం లేకపోవడం, అధికారులలోనే ఒకరిపై మరొకరు చాడీలు చెప్పుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఒకే పనికి రెండు, మూడుసార్లు బిల్లులు మంజూరు ఎలా చేస్తారని నిలదీశారు. తదుపరి సమావేశానికి సరైన సమాచారంతో రావాలని సెక్రటరీ ఝాన్సీరాణిని ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఈ విషయంపై సెక్రటరీని వివరణకోరగా నూతన పాలకవర్గానికి ఇచ్చిన అభివృద్ధి పనుల సమాచార నివేదికలో తప్పులు పడినట్లు గుర్తించామని, తదుపరి సమావేశానికి ఖచ్చితమైన సమాచారం అందజేస్తామన్నారు. పాలకవర్గం లేని సమయంలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకే అభివృద్ధి పనులకు చెక్కులు మంజూరు చేశామన్నారు.

### కావలి ఏఎంసిని అభివృద్ధి చేస్తాం - ఛైర్మెన్ దేవరాల

రైతుల అభివృద్ధి కోసం నూతన పాలకవర్గం రానున్న రోజుల్లో పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం తెలిపారు. రానున్న వ్యవసాయ సీజన్ కోసం రైతులకు విత్తనాలను సబ్సిడీతో సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మామిడి, చింతకాయలు విక్రయాలు ట్రంకురోడ్డుపై కాకుండా యార్డులో స్థలం కేటాయించి అమ్ముకునే సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. భూసార పరీక్షా కేంద్రానికి అవసరమైన యంత్ర పరికరాలు కొనుగోలు చేసి రైతులకు ఉపయోగపడేవిధంగా కృషి చేస్తామన్నారు.

# కావలి ఎమ్మెల్యేకి కారు ప్రమాదం



కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గురువారం తెల్లవారుజామున బెంగుళూరు నుంచి కావలికి కారులో వస్తుండగా పెళ్లకూరు సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న కారు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనతో పాటు కారులో వున్న మిగతావారికి స్వల్పగాయాలయ్యాయి. రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని వెంటనే నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చేర్చి చికిత్సనందించారు. ఆయనకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో కావలి వైకాపా కార్యకర్తలు, అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు. ఆసుపత్రిలో ప్రతాప్‌ను మాజీఎమ్మెల్యే, వైకాపా నాయకులు వంటేరు వేణుగోపాలరెడ్డితో పాటు పలువురు నాయకులు, కావలి నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు, ప్రముఖులు పెద్దసంఖ్యలో వచ్చి పరామర్శించారు.

# కల్యాణ వైభవం...!



నెల్లూరుకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ బట్రెడ్డి వెంకటకృష్ణారెడ్డి - అరుణల కుమార్తె **వెంకట సాయి సింధూరి - దినేష్‌రెడ్డి** (చిత్తూరుజిల్లా శాంతిపురం గ్రామ వాస్తవ్యులు పాలూరి నారాయణరెడ్డి - మీనల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 11వ తేదీ నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



వాత్సల్య - జనహిత గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి మనుమరాలు, సామంతు శ్రీధర్‌రెడ్డి - శిరీషల కుమార్తె **శ్రావ్య - అమిత్‌రెడ్డి** (మేజర్ వారణాసి హరకుమార్‌రెడ్డి - ప్రశాంతిల కుమారుడు)ల వివాహం ఈ నెల 7వ తేదీ నెల్లూరు ధనలక్ష్మీపురంలోని కెజికె కల్యాణ మండపంలో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి



ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కావలి మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు అన్నారు. సోమవారం గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయం వద్ద జరిగిన మహాసంకల్ప సభకు కావలి నియోజకవర్గ తెదేపా శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ముందుగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీద మస్తాన్‌రావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య పార్టీ జెండా ఊపగా బీద బైక్‌ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సంకల్పాన్ని దెబ్బతీసేందుకే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుళ్లు రాజకీయాలతో కుట్ర పన్నుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి సుబ్బరాయుడుగుప్తా, ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కావలి వారి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల
పాతవూరు, కావలి. ఫోన్ : 08626-250579
2015 ఇంటర్ ఫలితాలలో టౌన్ ఫస్ట్... టౌన్ ఫస్ట్... టౌన్ ఫస్ట్...
Jr. Inter (MPC) టాపర్స్
464/470 463/470 462/470 461/470 461/470 461/470
460/470 459/470 459/470 459/470 458/470 458/470
458/470 458/470 458/470 458/470 458/470
MPC గ్రూపు నందు 470 మార్కులకు గాను 400కి పైగా సాధించిన మా విద్యార్థులు : 140 మంది
MEC టాపర్స్ 476/500 441/500 425/500 418/500 403/500 401/500
BiPC టాపర్స్ 422/440 421/440 409/440 403/440 403/440
CEC టాపర్స్ 425/500 420/500
1 TOWN 464 470
1 COLLEGE 982 1000
Sr. Inter (MPC) టాపర్స్ 982 978 976 976 976 976 975 975
MPC గ్రూపు నందు 1000 మార్కులకు గాను 900 కి పైగా సాధించిన మా విద్యార్థులు : 104 మంది 972 972 971 971
BiPC టాపర్స్ 965 961 959 950 947 సీట్లు పరిమితం
MEC టాపర్స్ 958 957 950 అడ్మిషన్లకు సంప్రదించండి
మా గ్రూపులు MPC, BiPC MEC, CEC (E.M & T.M), EAMCET & AIEEE లకు లాంగ్ టర్మ్ & షార్ట్ టర్మ్ కోచింగ్ ఇవ్వబడును.
ప్రిన్సిపల్ 94923 36694 | డైరెక్టర్ 98495 57239 | ఆఫీస్ 81435 74262

శుభాకాంక్షలు
పత్రికా రంగంలో తనకంటూ ప్రత్యేకతను సాధించుకుని 34ఏళ్లు పూర్తి చేసుకుని 35వ యేట అడుగిడిన లాయర్ వారపత్రికకు హార్దిక శుభాభినందనలు.



ఈ నెల 15వ తేదీన జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న ప్రజావైద్యులు, మా ఆత్మీయులు డా॥ ఎన్.ప్రభాకర్‌నాయుడు గారికి జన్మదిన శుభాకాంక్షలు.
ఉచిత వైద్యశిబిరం: డా॥ ప్రభాకర్‌నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా కావలిలోని డా॥ గుండెమడగల దేవదానం మెమోరియల్ హాస్పిటల్ నందు ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్ వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడును. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మనవి.
- సిబ్బంది, డా॥ గుండెమడగల దేవదానం మెమోరియల్ హాస్పిటల్, కావలి

# ఓర్వలేకనే బాబుపై కెసిఆర్ కుట్రలు



## - బీదా రవిచంద్ర ధ్వజం

లోటు బడ్జెట్‌లో వున్న రాష్ట్రాన్ని చక్కదిద్ది అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తుంటే, చంద్రబాబుకు ప్రజల్లో ఎక్కడ మంచిపేరు వస్తుందోనని ఓర్వలేక కెసిఆర్ లేనిపోని కుట్రలన్నీ చేస్తున్నారని తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ధ్వజమెత్తారు. బుధవారం బాలకృష్ణ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన బాలకృష్ణ జన్మదిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణాలో తెలుగుదేశం పార్టీకి ఆదరణ లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతోనే కెసిఆర్ ఇలాంటి కుట్రలు చేస్తూ, చంద్రబాబునాయుడును ఇరుకున పెట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని, కెసిఆర్ వల్ల రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలు అవమానపడే దుస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం దివంగత నేత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని, తెలుగుదేశం పార్టీని ప్రజలు బాగా ఆదరిస్తుండడంతో కెసిఆర్ తట్టుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ, బాలకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో కోటంరెడ్డి ప్రతి ఏటా బాలకృష్ణ జన్మదినవేడుకలను ఘనంగా జరుపుతుండడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, బాలకృష్ణ సేవాసమితిని సేవా దృక్పథంతో ఏర్పాటుచేశామన్నారు. పదవ తరగతిలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు తెచ్చుకున్న భాను అనే విద్యార్థినికి బాలయ్య సూచనల మేరకు తమ సంస్థ దత్తత తీసుకుంటున్నారు. ఆ విద్యార్థిని ఐఎఎస్ చదివేవరకు తాము బాధ్యత తీసుకుంటామని ఆయన అన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక అనూరాధ, మాజీ ఎంపీ ఉక్కాల రాజేశ్వరమ్మ, నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, నూనె మల్లికార్జునయాదవ్, ఎన్బీకె ఫ్యాన్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎద్దల రవి, జలదంకి సుధాకర్; పోతయ్య, శ్రీను, ఎం.వెంకటేశ్వర్లు, బాషా, ధర్మవరపు సుబ్బారావు, మండవ రామయ్య, వైవీ సుబ్బారావు, పడవల కృష్ణమూర్తి, కె.బాలాజీ, బ్రహ్మనాయుడు, సుధీర్‌నాయుడు, మొయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాబూ!.. వెంటనే దిగిపో!

## - వైకాపా నేతల డిమాండ్

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోట్ల రూపాయలతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన తెలుగుదేశం అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెంటనే సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నెల్లూరుజిల్లా వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు దిష్టిబొమ్మను తగలబెట్టారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కెవిఆర్ పెట్రోల్‌బంకు వద్ద మానవహారం నిర్వహించి చంద్రబాబు రాజీనామా చేయాలంటూ నినాదాలు చేసారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలం జాతీయ రహదారిపై రాస్తా రోకో నిర్వహించి నిరసన తెలిపారు. అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఆంధ్రా ప్రజలు తల దించుకునే విధంగా ప్రవర్తించిన చంద్రబాబు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలో వైకాపా ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ వద్ద ధర్నా చేపట్టారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం నుండి సోమశిల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అలాగే కావలిలో వైసిపి నాయకులు, కార్యకర్తలు బ్రిడ్జిసెంటర్ వద్ద ధర్నా నిర్వహించి చంద్రబాబు రాజీనామాకు డిమాండ్ చేశారు.

జిల్లాలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లో కూడా వైకాపా ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు.

# చిక్కుల్లో చంద్రుడు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు తల, గడ్డం పండిన రాజకీయ యోధుడు. అశేష ప్రజాదరణ పొందిన ఎన్టీఆర్‌నే ఎందుకూ పనికిరాకుండా చేసిన ఘనుడు. తన రాజకీయవిద్యలతో ఎందరికో చుక్కలు చూపించాడు. మరెందరి రాజకీయ జీవితాలకో సమాధికట్టాడు. తాడిని తన్నేవాడొకడుంటే వాడి తలను తన్నేవాడు ఇంకొకడుంటాడని పెద్దలు చెప్పిన మాటలు అప్పుడప్పుడు నిజమవుతుంటాయి. తన రాజకీయ అస్త్రశస్త్రాలతో ఎందరో నాయకులను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించిన చంద్రబాబుకే ఈరోజు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాడు తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్. ఆ తర్వాత బీజేపీ కూడా వుంది. కాని కేసీఆర్ ఆ రెండు పార్టీల జోలికి పోవడం లేదు. తెలుగుదేశంనే టార్గెట్ చేసుకున్నాడు. చంద్రబాబు తోకకు తాటాకు కట్టి హైదరాబాద్ నుండి తరిమేయడమే లక్ష్యంగా ఎంచుకున్నాడు. ఈ లక్ష్యంలో ఆయనకు రేవంత్‌రెడ్డి వ్యవహారం వజ్రాయుధంలా దొరికింది.

తెలంగాణ శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు 5కోట్ల ఒప్పందంలో భాగంగా 50లక్షలు అడ్వాన్స్ ఇస్తూ రేవంత్‌రెడ్డి ఏసిబి కెమెరా కళ్లకు పక్కాగా దొరికిపోవడం తెలిసిందే! ఈ కేసులో అరెస్టైన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్నాడు. అయితే ఓటుకు 5కోట్లు కథ ఇక్కడితో ముగియలేదు. స్టీఫెన్‌సన్‌తో రేవంత్‌రెడ్డి జరిపిన సంభాషణలో 'బాస్' నన్ను పంపించాడు అనేది వినపడింది. ఆ బాస్ ఎవరనేది అందరికీ పరోక్షంగా తెలిసినా సాక్ష్యాలతో సహా బయటపెట్టాలనుకున్నారు. ఎట్టకేలకు ఆ బాస్ ఎవరనేది కూడా తెలంగాణ ఏసిబి అధికారులు బయటపెట్టేసారు. స్టీఫెన్‌సన్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడిన వివరాలు రికార్డ్ అయ్యాయి. స్టీఫెన్‌సన్ ఫోన్‌లోనే చంద్రబాబు మాటలను రికార్డు చేసారు. ఈ ఆధారాలను ఏసిబి అధికారులు మీడియా ముందు పెట్టారు. ఇక్కడితో చంద్రబాబు అడ్డంగా బుక్కయ్యాడు.

తెలంగాణలో పలువురు తెలుగుదేశం ఎమ్మెల్యేలు తెరాసలో చేరిపోయారు. దీంతో ఎమ్మెల్సీని గెలిపించుకునే బలం ఆ పార్టీకి లేకుండా పోయింది. అయినా తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేం నరేంద్రరెడ్డిని అభ్యర్థిగా నిలబెట్టారు. ఒక్క ఎమ్మెల్సీని గెలిపించుకోవడం కోసం కోట్లు కుమ్మరించడానికి సిద్ధపడ్డారు. ఇందులో భాగంగా ఓ ఆరుమంది ఎమ్మెల్యేలను కొనాలనే దిశగా ప్రణాళిక రచించారు. పట్టిసీమ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ ద్వారా డబ్బు సమకూర్చుకున్నట్లు, గరికపాటి రామ్మోహన్, సిఎం రమేష్‌లు ఈ ఆర్థిక వ్యవహారాలలో కీలకపాత్ర పోషించినట్లు కూడా తెలంగాణ ఏసిబికి ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. వీటిని ఆధారంగా చేసుకునే చంద్రబాబుతో సహా మరికొందరిపై కేసులు నమోదు చేసేందుకు తెలంగాణ ఏసిబి అధికారులు సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

ఒక ఓటు-5కోట్లు కథలో తన ఫోన్ వాయిస్ రికార్డు బయటపడగానే చంద్రబాబులో సైతం ఆందోళన నెలకొన్నట్లుగా కనిపిస్తోంది. ఆయన తన ఫోన్‌ను ట్యాపరింగ్ చేసారని, ఇది నేరమని ఆరోపిస్తున్నారు. కానీ ఆయన ఫోన్ ట్యాపరింగ్ చేయలేదని, ఆయన మాటలను అవతల వ్యక్తి రికార్డు చేసారని తెలంగాణ ఏసిబి అధికారులు చెబుతున్నారు. దీనిని రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా మలిచే ప్రయత్నం కూడా తెలుగుదేశం నాయకులు చేస్తున్నారు. అయితే ఆంధ్రాలోని విపక్షాలన్నీ చంద్రబాబు తీరును దుయ్యబడుతూ ఇది మీ వ్యక్తిగత వ్యవహారమని, రాష్ట్రాల మధ్య, ప్రజల మధ్య అంతరాలు సృష్టించవద్దని చంద్రబాబుకు హితబోధ చేస్తున్నాయి.

ఈ వ్యవహారంలో చంద్రబాబుపై కేసు నమోదు చేయాలనే పట్టుదలతో కేసీఆర్ ఉన్నాడు. చంద్రబాబుకు ఈ విషయం అర్థమైపోయింది. ఆయనను కాపాడగలిగేది కేంద్రమే. అందుకే ఢిల్లీ వెళ్లాడు. అయితే అవినీతి లేని నీతివంతమైన పాలన అందిస్తామంటున్న నరేంద్రమోడీ ఆయనను ఆదుకోవడం కష్టమే.

ఇప్పటిదాకా చంద్రబాబు తనకుతాను ఆంధ్రా హజారేనంటూ చెప్పుకు తిరిగాడు. నీతికి నిలువెత్తు రూపాన్నాడు. నీతి, నిజాయితీలకు చొక్కా, ఫ్యాంటు వేస్తే అచ్చం చంద్రబాబులా ఉంటాడని తెలుగుదేశం నాయకులు చెబుతూ వచ్చారు. ఇంతకాలం జగన్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పుడు జరిగిన సంఘటనతో తెలుగుదేశం కేడర్ మొత్తం నిరుత్సాహంలో ఉండగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వాళ్లు మాత్రం 'పండగచేస్కో' అన్నట్లుగా ఆనందంలో తేలిపోతున్నారు.

# వై 'కాపు'

(మొదటి పేజీ తరువాయి)

గత ఎన్నికల్లో జగన్‌ది ఊహించని పరాజయం. దీనికి ప్రధాన కారణాలు కొన్ని పరిశీలిస్తే... విభజన అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. ఆ పార్టీలో మిగిలిన కేడర్ మొదట జగన్ వైపు చూసింది. కాని వాళ్లు పార్టీ కార్యాలయం ముందు 'హౌస్‌ఫుల్' బోర్డు పెట్టడంతో ఆ కేడర్ అంతా కూడా తెలుగుదేశంలోకి దూరింది. ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో నరేంద్ర మోడీ ఫోబియా చంద్రబాబుకు కలిసొచ్చింది. చంద్రబాబు అనుభవజ్ఞుడు, ఓటర్ల నాడి పసిగట్టడంలో దిట్ట. ఋణమాఫీ అంశాన్ని ఇట్టే క్యాచ్ చేశాడు. అలివికానిదని తెలిసినా హామీ ఇచ్చాడు. అధికారం చేతికొస్తే చాలు... ఆ తర్వాత హామీలను గాలికొదిలినా ఏమీ కాదనే విషయం చంద్రబాబుకు తెలుసు. కాని జగన్ ఋణమాఫీ విషయంలో వెనక్కు తగ్గాడు. సరికదా పదేపదే ఋణమాఫీ అసాధ్యం అంటూ రైతులు, మహిళల ఓట్లను ఆ విధంగా పోగొట్టుకున్నాడు. తర్వాత బలమైన ప్రభావం చూపింది క్రిస్టియానిటీ! వై.యస్. కుటుంబం క్రైస్తవులనే విషయం అందరికీ తెలుసు. దీనికోసం వాళ్లు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. క్రిస్టియన్స్ ఓట్లన్నీ వాళ్లకే పడతాయి. కాని విజయమ్మ, షర్మిలలు బహిరంగంగానే అలా వ్యవహరించడంతో బ్రాహ్మణులు, వైశ్యులు గత ఎన్నికల్లో వైకాపాకు పూర్తిగా దూరమయ్యారు. వైకాపా పరాజయంలో ఇదొక ప్రధాన అంశం.

అన్నింటికీమించి చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కమ్మ, కాపు వర్గాలు కలిసిపోవడం గత ఎన్నికల్లో జగన్‌కు పెద్ద షాక్‌నిచ్చింది. రాష్ట్రంలో ఎప్పుడూ రెడ్లు, కాపుల కాంబినేషన్ ఉండేది. రెడ్ల ఆధిపత్యం ఉండే జిల్లాల్లో కాపులు వారికి మద్దతుగా ఉండేవాళ్లు. కాపుల ప్రాబల్యం గల కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి వంటి జిల్లాల్లో కాపుల నాయకత్వానికి రెడ్లు మద్దతుగా నిలుస్తూ వచ్చారు. ప్రధానంగా కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లో గత ఎన్నికల వరకు కూడా కాపులకు, కమ్మ వర్గానికి పడేది కాదు. కాని జగన్ తలరాతో, పవన్ కల్యాణ్ ప్రభావమో ఏదైనాగాని మొన్న ఎన్నికల్లో మాత్రం ఆ రెండు వర్గాలు కలిసి పనిచేయడం కూడా వైకాపా పరాజయానికి కారణంగా చెప్పుకోవచ్చు.

గత ఎన్నికల్లో వెలుగుచూసిన లోటుపాట్లను సరిదిద్దే పనిలో వున్న జగన్ ఈ పరంపరలోనే కాపులను సైతం పార్టీకి చేరువ చేయాలనుకున్నాడు. దీనిలో భాగంగానే పిసిసి మాజీఅధ్యక్షుడు బొత్స సత్యనారాయణను పార్టీలో చేర్చుకున్నారు. వై.యస్. వున్నంతకాలం బొత్స ఆయనకు వీరవిధేయుడిగా ఉన్నాడు. కుటుంబానికంతటికీ పదవులిప్పించుకున్నాడు. విజయనగరం జిల్లాను పూర్తిగా తన గుప్పిట్లో ఉంచుకున్నాడు. వై.యస్. మరణించాక కాంగ్రెస్ అధిష్టానానికి లొంగిపోయి వై.యస్. మీద, జగన్ మీద కూడా విమర్శలు గుప్పించాడు. అలాంటి బొత్సను పార్టీలో చేర్చుకోవడాన్ని చాలామంది వ్యతిరేకించారు కూడా! అయితే రాష్ట్రంలో అధికారం చేపట్టాలంటే ఇప్పుడు కాపులే కీలకం. వారి దన్ను లేకుండా అధికారం అసాధ్యం. కాపులు ఇప్పటికే చంద్రబాబు మీద వ్యతిరేకతతో వున్నారు. కాబట్టి వారిని ప్రసన్నం చేసుకునే క్రమంలోనే బొత్సను పార్టీలో చేర్చుకున్నాడు.

కమ్మ వర్గం, బీసీలు తెలుగుదేశంకు బలమైన మద్దతుదారులు. రెడ్లు, ఎస్సీలు వైకాపాకు అండగా ఉన్నారు. కాపులు ఎటు మొగ్గితే అటు గెలుపు. ఈ సూత్రంతోనే జగన్ ఇప్పటి నుండే కాపు నాయకుల కోసం కాపుకాసి పడుతున్నట్లు తెలుస్తోంది.


# ఉత్తరక్రియలు



శ్రీ జక్కా చంద్రశేఖర రెడ్డి
కాగులపాడు, బుచ్చిమండలం, నెల్లూరుజిల్లా.
ఫౌండర్, పేపర్ కారుగేటింగ్ ఇండస్ట్రీస్, చెన్నై.

మంచి మనసున్న మానవతామూర్తి
మాకు మార్గదర్శకులు, మా తండ్రి
శ్రీ జె.చంద్రశేఖరరెడ్డి గారు
తే. 04.06.2015ది గురువారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చమని
భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య - లలిత
కుమారులు - కోడళ్లు
వెంకటేష్ - కృష్ణవేణి
ప్రసన్న - మమత
మరియు మనుమలు, బంధుమిత్రులు

పెద్దకర్మ తే.18.06.2015ది గురువారం చెన్నై, అన్నానగర్‌లోని టవర్‌క్లబ్ నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

www.gvspl.com

# GVSPL®

COMFORT, CONVENIENCE, CLASS & CRAFTSMANSHIP

*Replete with modern amenities*



GREEN PARK
THE PRIVILEGED LIFE
NUNGAMBAKKAM, CHENNAI

@ Nungambakkam

Stilt + 4 Floors
19 Units
3 & 4 BHK
1710 & 3420 Sft

GVSPL Raksha
Valasaravakkam, Chennai

@ Valasaravakkam

Stilt + 4 Floors
35 Units
2 & 3 BHK
1145 - 1860 Sft





GREEN CREST

@ Anna Nagar

Stilt + 4 Floors
28 Units
3 BHK
1260 & 1345 Sft

OTHER ONGOING PROJECTS

CHENNAI
GVSPL Raajguru — *Vengaivasal*
Green Meadows — *Thiruvanmiyur*
GVSPL Sanmuga — *Mugalivakkam*

COIMBATORE
Green County — *Vilankurichi Road*

TRICHY
Gvspl Srinivasa — *Srinivasa Nagar*
Gvspl Kauvery — *Thillai Nagar*
Gvspl Plazaa — *Ariyamangalam*

For details contact: +91 86086 33333 | 90870 23222 | 90870 28222 | sales.chennai@gvspl.com

**Green Valleys Shelters (P) Ltd.,**®
Promoters & Developers | Engineering Contractors
# 119, St. Mary's Road, Chennai - 600 018 | sales.chennai@gvspl.com

Member CREDAI

Architects & PMC AAD ARCHITECTS ISO 9001:2008

GROWING GLOBAL & GOING GREEN 4G

Disclaimer: The information contained in this advertisement is subject to change and does not form a part of an offer. GVSPL reserves the right to make modifications, alterations and additions as maybe required without prior notice.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com